తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
# జనంసాక్షి
www.janamsakshi.org
ఖమ్మం - నల్లగొండ
భద్రాద్రి కొత్తగూడెం | సూర్యాపేట | యాదాద్రి భువనగిరి
శుక్రవారం 15 మే 2026 | పేజీలు : 8

# అప్పు తెచ్చి సాగు చేస్తే నిప్పుల పాలై నిలువునా మునిగారు



- ఎండాకాలంలో రైతులకు అగ్నిప్రమాదాల ముప్పు
- కళ్లముందే బూడిదవుతున్న అన్నదాత కష్టం
- రైతు బతికితేనే దేశం బతుకుతుందని ఆవేదన
- పంటల రక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలి
- వరి, మక్కజొన్న, పత్తి, గడ్డి మోపులు, ధాన్యం నిల్వలు అగ్నికి ఆహుతవడంతో రైతులు తీవ్ర నష్టాలు
- మండలంలో ప్రత్యేక ఫైర్ రెస్పాన్స్ బృందాలు, తక్షణ పరిహారం, పంట బీమా సులభతరంచెయ్యాలి : రైతుల ఆవేదన

**చింతకాని, మే 14 (జనంసాక్షి)**
ఎండాకాలం మొదలైతే చాలు గ్రామీణ ప్రాంతాల్లో అగ్నిప్రమాదాల భయం రైతులను వెంటాడుతోంది. నెలల తరబడి రాత్రింబవళ్లు కష్టపడి సాగు చేసిన పంటలు కోత దశకు చేరుకున్న సమయంలో ఒక్కసారిగా మంటల్లో చిక్కుకుని బూడిదవుతున్న ఘటనలు పలుచోట్ల ఆందోళన కలిగిస్తున్నాయి. వరి, మక్కజొన్న, పత్తి, ఎండబెట్టిన ధాన్యం, గడ్డి మోపులు, పశువుల మేత నిల్వలు అగ్నికి ఆహుతవుతుండటంతో రైతులు తీవ్ర ఆర్థిక, మానసిక వేదనకు గురవుతున్నారు. ఒకవైపు పెట్టుబడుల భారం, మరోవైపు ప్రకృతి విపత్తులు, మార్కెట్‌లో సరైన ధరలు లేకపోవడం వంటి సమస్యలతో ఇప్పటికే ఇబ్బందులు పడుతున్న రైతుకు ఇప్పుడు అగ్నిప్రమాదాలు కొత్త కష్టాలను తెచ్చిపెడుతున్నాయి. కొంతమంది రైతులు అప్పులు చేసి సాగు చేస్తుంటే, మరికొందరు బంగారం తాకట్టు పెట్టి పంటలను పెంచుతున్నారు. అలాంటి సమయంలో కోతకు సిద్ధమైన పంట కళ్లముందే కాలిపోవడం రైతును పూర్తిగా కుంగదీస్తోంది. గ్రామాల్లో విద్యుత్ తీగలు తెగిపడటం, ట్రాన్స్‌ఫార్మర్లు స్పార్కింగ్ అవడం, నిర్లక్ష్యంగా పడేసిన బీడీలు, సిగరెట్లు, పొలాల వద్ద చెత్తకు నిప్పంటించడం, ఎండగాలుల ప్రభావం వంటి కారణాలతో చిన్న మంటలు కూడా భారీ అగ్నిప్రమాదాలుగా మారుతున్నాయని రైతులు చెబుతున్నారు. ముఖ్యంగా మధ్యాహ్న సమయంలో గాలులు బలంగా వీచడం వల్ల మంటలు వేగంగా వ్యాపించి పక్క పొలాలకు కూడా చేరుతున్నాయని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**రైతు కష్టం విలువైనదే కానీ రక్షణ ఎక్కడ?:**
ఒక ఎకరం పంటను సాగు చేయడానికి రైతు విత్తనం నుంచి కోత వరకు వేల నుంచి లక్షల రూపాయలు ఖర్చు చేస్తున్నాడు. ఎరువులు, పురుగుమందులు, కార్మికుల కూలీలు, నీటి ఖర్చులు, ట్రాక్టర్ అద్దెలు ఇలా ప్రతి దశలో రైతుపై భారం పెరుగుతోంది. పంట చేతికి వచ్చే సమయానికి అగ్నిప్రమాదం సంభవిస్తే రైతు ఏడాది కష్టం నిమిషాల్లో బూడిదవుతోంది. పంట కాలిపోవడం వల్ల రైతు కుటుంబాలు ఆర్థికంగా మాత్రమే కాదు, మానసికంగా కూడా తీవ్రంగా దెబ్బతింటున్నాయి. కొందరు రైతులు అప్పులు ఎలా తీర్చాలో తెలియక ఆందోళన చెందుతుంటే, మరికొందరు కుటుంబ పోషణ గురించి ఆలోచిస్తూ కన్నీటి పర్యంతమవుతున్నారు. “పంట కాలిపోతే రైతు జీవితం కూడా కాలిపోయినట్లే” అని పలువురు అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ప్రభుత్వం చేపట్టాల్సిన అత్యవసర చర్యలు:**
రైతుల పంటలను అగ్నిప్రమాదాల నుంచి రక్షించేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని రైతు లు డిమాండ్ చేస్తున్నారు . ప్రతి మండలంలో ప్రత్యేక ఫైర్ రెస్పాన్స్ బృందాలను ఏర్పాటు చేసి ఎండాకాలంలో 24 గంటలు అందుబాటులో ఉంచాలని కోరుతున్నారు. గ్రామ స్థాయిలో వ్యవసాయ శాఖ, అగ్నిమాపక శాఖ, విద్యుత్ శాఖ అధికారులు సంయుక్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించి రైతులకు ముందస్తు జాగ్రత్తలపై శిక్షణ ఇవ్వాలని సూచిస్తున్నారు. పొలాల దగ్గర పాత విద్యుత్ తీగలు, ప్రమాదకర ట్రాన్స్‌ఫార్మర్లను వెంటనే మార్చాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

**అగ్నిప్రమాదాల్లో నష్టపోయిన రైతులకు తక్షణ పరిహారం:**
అందించేందుకు ప్రత్యేక నిధులు ఏర్పాటు చేయాలని రైతు సంఘాలు కోరుతున్నాయి. పంట బీమా అమలు ప్రక్రియను సులభతరం చేసి, నష్టం జరిగిన వెంటనే అధికారులు గ్రామాలకు చేరుకుని మిగతా 2లో

# గోదావరి పుష్కరాలకు భద్రాద్రి ముస్తాబు!







- రూ. 350 కోట్లతో ఆలయ అభివృద్ధి పనులు
- అధికారులతో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కీలక సమీక్ష..
- జూన్, జూలై కల్లా కరకట్టలపై నర్సరీల ఏర్పాటుకు ఆదేశం..
- పుష్కరాలకు భద్రాద్రిని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దాలి..
- భద్రాద్రి రామయ్యను దర్శించుకున్న మంత్రి తమ్ముల..

**భద్రాచలం మే 14 (జనంసాక్షి)**
దక్షిణ అయోధ్యగా బాసిల్లుతున్న భద్రాచలంలో వచ్చే ఏడాది జూలై నెలలో జరిగే గోదావరి పుష్కరాలపై మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పుష్కరాలకు దేశ నలుమూలల నుండి, విదేశాల నుండి భక్తులు గోదావరి నదిలో స్నానం ఆచరించి శ్రీ సీతారామచంద్ర స్వామి దర్శనానికి వచ్చే భక్తులకు ఇలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన ఏర్పాట్లు ఘనంగా చేయాలని తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్ జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సంబంధిత అధికారులకు ఆదేశించారు. గురువారం భద్రాద్రి రామాలయం వసతి గృహములో స్థానిక శాసనసభ్యులు తెల్లం వెంకట్రావు, అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ పోదెం వీరయ్య, ఐటీడీఏ పీవో బి రాహుల్, సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ఠ, సర్పంచ్ పూనెం కృష్ణ, ఇతర శాఖల అధికారులతో కలిసి రాబోయే గోదావరి పుష్కరాలకు చేపట్టవలసిన కార్యాచరణ విధి విధానాలు గురించి ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు కొన్ని సూచనలు ఇస్తూ గోదావరి పుష్కరాలు దగ్గర పడుతున్నందున ప్రతి శాఖ అధికారి భద్రాచలం అభివృద్ధికి పాటుపడాలని, భద్రాచలం పట్టణంతో పాటు పరిసరాలు మరియు వార్డులు సర్వ సుందరంగా ఉండేలా చూడాలని, శానిటేషన్ పరంగా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని, భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా జూన్ జూలై మాసాలలో కరకట్ట ప్రదేశాలలో నర్సరీ ప్లాంట్లు ఏర్పాటు చేయాలని తగు సూచనలు చేశారు. రోడ్లు, లైట్లు విద్యుత్ వంటి మౌలిక సదుపాయాలు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని, పారిశుధ్యం కోసం మిగతా 2లో

# రైతన్నకు అండగా ప్రజా ప్రభుత్వం

- పదేళ్లు రైతులను గోసపెట్టి.. ఇప్పుడు 'సోల్లు' పురాణమా?
- నాడు సంకెళ్లు వేసిన వారు నేడు కపట ప్రేమ చూపుతున్నారు
- ఏదులాపురం మున్సిపాలిటీ క్లస్టర్-1 ప్రజా దర్బార్ లోమంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి వ్యాఖ్యలు



**ఖమ్మం రూరల్, మే 14 (జనంసాక్షి)**
పదేళ్ల అధికార దాహంలో పేదవాడిని విస్మరించి, నాడు రైతుల చేతులకు సంకెళ్లు వేసిన వారు.. నేడు రంగు రంగుల అవతారాలతో వస్తే ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ప్రతిపక్షాలపై విరుచుకుపడ్డారు. ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలో జరిగిన 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక' క్లస్టర్-1 సమావేశంలో ఆయన ముఖ్యాతిథిగా పాల్గొని ప్రసంగించారు.

**- నాడు వరి వేస్తే ఉరి.. నేడు కపట కన్నీరు!**
ప్రతిపక్షాల తీరును ఎండగడుతూ.. నాడు అధికారంలో ఉండి వరి వేస్తే ఉరి అని రైతులను భయపెట్టిన దొరవారు, నేడు రైతుల కోసం పోరాడుతున్నామంటే దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉంది. దోసిల్లో మొక్కలు పెట్టుకుని, కుండలకు పూతలు పూస్తూ ఫోటోలకు ఫోజులిస్తే ప్రజలు మోసపోరు. మీ పదేళ్ల పాలనలో అధికారులు ఏనాడూ పేదల వద్దకు రాలేదు, కానీ ఈనాడు మేమే స్వయంగా ప్రజల గడప వద్దకు వచ్చి అప్లికేషన్లు తీసుకుంటున్నామని మంత్రి పొంగులేటి పేర్కొన్నారు.

**- విషం కక్కుతున్న విపక్షాలు..**
ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి జీర్ణించుకోలేక ప్రతిపక్షాలు ఒంటి నిండా విషాన్ని నింపుకొని రోడ్ల వెంట విషం కక్కుతున్నాయని మంత్రి మండిపడ్డారు. మూడు నాలుగు సార్లు ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పినా మీకు జ్ఞానం రాలేదు. కుట్రలు, కుతంత్రాలతో ప్రభుత్వాన్ని అస్థిరపరచాలని చూస్తే మీ కన్న కలలు కలలుగానే మిగిలిపోతాయని బీఆర్ఎస్ ను ఉద్దేశించి అన్నారు. ప్రజా దీవెనలు ఉన్నంత వరకు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎవరూ ఏమీ చేయలేరన్నారు. హెచ్చరించారు.

**- చేతల్లో చూపిస్తున్నాం..**
సోల్లు పురాణం చెప్పే ప్రభుత్వం మాది కాదు.. చేతల ప్రభుత్వం. ఇప్పటికే 73 వేల ఉద్యోగాలు ఇచ్చాం. నిరుద్యోగులకు త్వరలోనే మరిన్ని మిగతా 2లో

### అప్పు తెచ్చి సాగు చేస్తే

# నిప్పుల పాలై నిలువునా మునిగారు



అంచనా వేసి పరిహారం చెల్లించే విధానం తీసుకురావాలని డిమాండ్ చేస్తున్నారు.

అదేవిధంగా ప్రతి గ్రామంలో చిన్న ఫైర్ సేఫ్టీ కేంద్రాలు ఏర్పాటు చేసి నీటి ట్యాంకర్లు, ఇసుక బస్తాలు, ఫైర్ ఎక్విప్‌మెంట్ అందుబాటులో ఉంచితే ప్రారంభ దశలోనే మంటలను అదుపు చేయవచ్చని నిపుణులు సూచిస్తున్నారు.

**రైతులు తప్పనిసరిగా పాటించాల్సిన జాగ్రత్తలు:**

ఎండాకాలంలో రైతులు మరింత అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. పొలాల వద్ద ఎవరూ బీడీలు, సిగరెట్లు వేయకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలి. గడ్డి మోపులు, ధాన్యం కుప్పల దగ్గర విద్యుత్ తీగలు సురక్షితంగా ఉన్నాయో లేదో తరచూ పరిశీలించాలి.పొలాల చుట్టూ ఖాళీ ప్రదేశం ఉంచితే మంటలు వ్యాపించకుండా అడ్డుకోవచ్చు. పంట నిల్వల దగ్గర నీటి డ్రమ్‌లు, మోటార్లు, ఇసుక బస్తాలు సిద్ధంగా ఉంచడం ద్వారా మంటలను ప్రారంభ దశలోనే అదుపు చేయవచ్చు. పిల్లలు, పశు వులను మం టల ప్రాంతానికి దూరంగా ఉంచాలని అధికారులు సూచిస్తున్నారు.

**అగ్నిప్రమాదం జరిగిన వెంటనే చేయాల్సినవి:**

పొలాల్లో మంటలు కనిపించిన వెంటనే గ్రామస్థులను అప్రమత్తం చేయాలి. సమీప ఫైర్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వడంతో పాటు విద్యుత్ సరఫరా నిలిపి వేయాలి. మంటలు చిన్నస్థాయిలో ఉంటే నీరు, ఇసుకతో అదుపు చేసే ప్రయత్నం చేయాలి. గాలి దిశను గమనిస్తూ ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలి.ప్రమాదం జరిగిన వెంటనే రెవెన్యూ అధికారులు, పోలీసులకు సమాచారం అందించి నష్టం నమోదు చేయించుకోవాలి. ఫోటోలు, వీడియోలు తీసి ఆధారాలు సేకరించుకుంటే పరిహారం పొందడంలో ఉపయోగపడుతుందని అధికారులు చెబుతున్నారు.

**రైతు బతికితేనే దేశం బతుకుతుంది:**

రైతు కష్టాన్ని కాపాడటం ప్రభుత్వ బాధ్యత అని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. ముందస్తు జాగ్రత్తలు, అవగాహన కార్యక్రమాలు, తక్షణ పరిహారం, ఫైర్ సేఫ్టీ చర్యలు అమలు చేస్తేనే రైతులు అగ్నిప్రమాదాల నుంచి రక్షణ పొందగలరని చెబుతున్నారు. అన్నదాత చెమట చుక్కలకు విలువనిస్తూ ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుని రైతుకు భరోసా కల్పించాలని ప్రజలు, రైతు సంఘాలు కోరుతున్నాయి.

# రైతన్నకు అండగా ప్రజా ప్రభుత్వం



శుభవార్తలు చెబుతాం. గత ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లను కాగితాలకే పరిమితం చేస్తే, మేము ఒక్క రూపాయి అవినీతి లేకుండా ?5 లక్షల ఆర్థిక సాయం నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో వేస్తున్నామని మంత్రి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ టి.ఎస్. దివాకర, అడిషనల్ కలెక్టర్ శ్రీజ, మున్సిపల్ కమిషనర్ ఆళ్ల శ్రీనివాస్ రెడ్డి, చైర్ పర్సన్ పోకబత్తిని అనిత, వైస్ చైర్ పర్సన్ తమ్మినేని నవీన్ , 15 వార్డుల కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

# రహదారిపై భారీ వాహనాల నిలుపుదలపై నిషేధం

**టేకులపల్లి సర్పంచ్ బోడ బాలు నాయక్ హెచ్చరిక**

**రోడ్డు ప్రమాదాలపై పోలీసులు అవగాహన కల్పిస్తున్న పట్టించుకోని వాహనదారులు**

**రోడ్డు ప్రక్కన ఆగి ఉన్న వాహనాలను ఢీకొని మృత్యువాత గురైన సంఘటనలు ఎన్నో**

**ప్రమాదాలు నిలువరించడానికి సర్పంచ్ చొరవ**



**టేకులపల్లి, మే 14(జనంసాక్షి):**

930 పి జాతీయ రహదారి ఇల్లందు, కొత్తగూడెం ప్రధాన రహదారిలో టేకులపల్లి మండల కేంద్రంలోని టేకులపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో వరుసగా జరుగుతున్న రోడ్డు ప్రమాదాలను అరికట్టేందుకు సర్పంచ్ బోడ బాలు నాయక్ స్థానిక పోలీసులు నిత్యం కల్పిస్తున్న రోడ్డు ప్రమాదాల అవగాహన కార్యక్రమాలకు తన వంతు సహకరిస్తూ మండల కేంద్రంలో రోడ్డు కిరువైపులా వాహనాలు నిలుపుదల చేయడం నిషేధం గా ప్రకటిస్తూ కఠిన నిర్ణయం తీసుకున్నారు. టేకులపల్లి భారత్ పెట్రోల్ బంక్ నుండి గోలియతండ హెచ్.పి. పెట్రోల్ బంక్ (సేవాలాల్ గుడి) వరకు ప్రధాన రహదారికి ఇరువైపులా భారీ వాహనాలను నిలపడంపై తక్షణమే నిషేధం విధిస్తున్నట్లు ఆయన తెలిపారు. మండల కేంద్రంలోని కోయగూడెం ఓసి నుండి బొగ్గు రవాణా లారీల తాకిడితోనే ఇతర వాహనదారులకు రద్దీ మూలాన ఎన్నో ఇక్కట్లకు గురవుతున్నారు. దీనికి తోడు వాహనాలు రోడ్డు కిరువైపులా ఇష్టానుసారముగా నిలిపివేయడంతో ఎన్నో రోడ్డు ప్రమాదాలు నిత్యం జరుగుతూనే ఉన్నాయి. స్థానిక పోలీసులు హెచ్చరికలు చేస్తున్నప్పటికీ ఖాతరు చేయడం లేదు. ఈ మధ్యకాలంలోనే గత 20 రోజుల్లో ఈ మార్గంలో 10 ప్రమాదాలు జరగడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది. గత వారం జరిగిన ప్రమాదాల్లో రెండు గేదెలు మృతి చెందగా, ఇదే రహదారిపై జరిగిన ప్రమాదంలో హోల్‌సేల్ వ్యాపారి రాయల రాజేష్ అనే యువకుడు మృత్యువాత పడటం పట్ల టేకులపల్లి ప్రజానీకంతో పాటు, స్థానిక సర్పంచ్ తీవ్రగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఏడాదిన్నర క్రితం కూడా ఆగి ఉన్న వాహనాన్ని ఢీకొని ఓ యువకుడు దుర్మరణం పాలైన సంఘటన తెలిసిందే. మోటార్ సైకిల్ ప్రయాణికులు రోడ్డు ఎక్కాలన్న, దిగాలన్న ప్రాణాలు అరిచేతిలో పెట్టుకుని డ్రైవింగ్ చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతున్నాయి.రోడ్డు పక్కన నిలుపుతు న్న భారీ వాహనాల వల్ల ఎదురుగా వచ్చే వాహనా లు కనిపించక ఈ ఘోర ప్రమాదాలు జరుగుతున్నా యని నిత్యం పోలీసులు రోడ్డు ప్రమాదాలపై కల్పిస్తున్నా అవగాహనలకు సర్పంచ్ బాలు నాయక్ కూడా రోడ్డు ప్రమాదాల పట్ల శ్రద్ధ వహించడం శుభ పరిణామం. నిబంధనలు ఉల్లంఘించి రహదారికి ఇరువైపులా వాహనాలు నిలిపితే యజమానులకు భారీ జరిమానా విధించబడుతుందని హెచ్చరికలు జారీ చేశారు.మండల కేంద్రంలోని ఎంపీడీవో, ఎమ్మార్వో, పోలీస్ శాఖ అధికారులు ఈ విషయంపై ప్రత్యేక దృష్టి సారించి, ట్రాఫిక్ సమస్యను పరిష్కరించడానికి తన ప్రతిపాదనకు సహకరించాలని కోరారు. ప్రజలు ప్రయాణికుల ప్రజా ప్రయోజనాల కోసం వాహనాల నిలుపుదలపై మండల ప్రజలు సహకరిస్తూ అండగా ఉండాలని కోరారు.వాహనదారులు, డ్రైవర్లు ప్రజల ప్రాణాలను దృష్టిలో ఉంచుకుని సహకరించాలని, నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.నిరంతరం ప్రమాదాలు జరుగుతున్న ఈ బ్లాక్ స్పాట్ వద్ద అధికారులు తక్షణమే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని టేకులపల్లి మండల ప్రజలు,సర్పంచ్ బోడ బాలు నాయక్ డిమాండ్ చేస్తున్నారు.



# గోదావరి పుష్కరాలకు భద్రాద్రి ముస్తాబు!

ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటూ ఇంటింటికి తిరిగి సేకరించిన తడి చెత్త పొడి చెత్త డంపింగ్ యార్డ్ కి తరలించిన తర్వాత ఎరువుల తయారీతో పాటు గ్యాస్ ఉత్పత్తి కూడా చేయవచ్చని అందుకు తగ్గట్టు ప్రణాళికలు సిద్ధం చేసుకుని సమర్పించాలన్నారు. చెత్తను రోడ్డుమీద వేస్తే జరిమానా విధించేలా చర్యలు తీసుకోవాలని ఇంటింటికి తిరిగి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ముఖ్యంగా ఐటీడీఏ పీవో, సబ్ కలెక్టర్, దేవస్థానం ఈవో, ఆర్ అండ్ బి, ఇరిగేషన్, అటవీ శాఖ, టూరిజం అధికారులు త్వరలో సమావేశం నిర్వహించుకొని గోదావరి పుష్కరాలకు కావలసిన ఏర్పాట్లు, కార్యాచరణ గురించి ప్రతిపాదనలు తయారుచేసి దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ పంపించాలని అన్నారు. ఇప్పటినుండే సంబంధిత అధికారులు గోదావరి పుష్కరాల ఏర్పాట్ల గురించి ప్రణాళికలు రూపొందించుకొని బాధ్యతగా పనులు ప్రారంభించి త్వరితగతిన ముగించి గోదావరి పుష్కరాలకు వచ్చే భక్తులతో పాటు భద్రాచలం పట్టణ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. ఇరిగేషన్ శాఖ అధికారులు గోదావరి వరద ముంపునకు గురి అయ్యే గ్రామాలను దృష్టిలో పెట్టుకొని షట్టర్ల రిపేరు చేయించుకోవాలని, జనరేటర్లు అందుబాటులో ఉంచుకోవాలని అన్నారు.

**- భద్రాద్రి రామయ్యను దర్శించుకున్న మంత్రి తుమ్మల**

రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్ చేనేత జౌళి శాఖ మాత్యులు తుమ్మల నాగేశ్వరరావు భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి వారిని దర్శించుకున్నారు. గురువారం స్వామి వారి దర్శనానికి వచ్చిన ఆయనకు దేవస్థానం ఈవో దామోదర్ రావు, అర్చక స్వాములు దేవస్థానం సాంప్రదాయం ప్రకారం పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. ముందుగా బలపీఠం వద్ద పూజలు నిర్వహించి, గర్భగుడిలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం లక్ష్మీ తాయారు అమ్మ వారిని, ఆంజనేయ స్వామిని దర్శించుకున్నారు. అర్చక స్వాములు స్వామివారి పట్టు వస్త్రాలు, జ్ఞాపికను అందించి స్వామివారి విశిష్టతను తెలిపి తీర్థప్రసాదాలు అందించారు. స్వామివారి దర్శనం అనంతరం ఆయన మాట్లాడుతూ భద్రాచలంలోని భద్రాద్రి శ్రీరాముని క్షేత్రం దక్షిణ భారతదేశానికి కాకుండా ప్రపంచమంతటికి శ్రీరాముడు అంటే భద్రాద్రిగా ప్రతి ఇంట్లో ప్రతి గ్రామంలో ఆయన కళ్యాణం చేసుకునేటువంటి కలియుగ రాముడు శ్రీ సీతారామచంద్ర స్వామి అని అన్నారు. భద్రాద్రి రాములు వారి సన్నిధిలో 1986 ఎన్టీ రామారావు సీఎంగా ఉన్న సమయంలో భద్రాద్రి క్షేత్రాన్ని అభివృద్ధి చేయడం జరిగిందని, అంతేకాకుండా 1986 మే 14న మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశానని, ఏ ప్రభుత్వంలో ఉన్న భద్రాచలం పట్టణం కోసం, మన్యం ప్రాంతాల కోసం, దేవస్థానం అభివృద్ధి కోసం కృషి చేశానన్నారు. ప్రస్తుతం ఈ ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక శ్రద్ధతో భద్రాచలం లోని శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయం పునరుద్ధరణ కార్యక్రమాలు ఈ నెలలో ప్రారంభమవుతాయని, సుమారు 350 కోట్ల రూపాయలు ఈ క్షేత్రం యొక్క అభివృద్ధి కోసం ఆయన చేతుల మీదుగా భూమి పూజ చేయడం జరిగిందని, ఈ నెలలోనే అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభించడానికి ప్రణాళికలు రూపొందించడం జరిగిందని, పూర్తిగా ఆగమ శాస్త్ర ప్రకారము వేద పండితుల ఆలోచనకు అనుగుణంగా ఈ క్షేత్రం అభివృద్ధి జరగాలని, భద్రాద్రి పుణ్యక్షేత్రం పూర్తిస్థాయిగా అభివృద్ధి శ్రీ సీతారామచంద్రస్వామి ఆశీస్సులతో త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఆయనన్నారు. అలాగే భద్రాద్రి రామాలయం అభివృద్ధి పనులతో పాటు పర్ణశాల లోని శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయంలో కూడా భక్తులకు ఇబ్బందులు కలగకుండా పనులు చేయిస్తామని, ఈ నెలలో దేవస్థానం, ఇరిగేషన్, ఆర్ అండ్ బి ముఖ్యమైన అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి దేవస్థానం అభివృద్ధికి సంబంధించిన అన్ని పనులు ప్రారంభించి పుష్కరాల నాటికి పూర్తి కావాలన్నారు. అనంతరం తాతగుడి సెంటర్లో వేంచేసి ఉన్న శ్రీ దాసాంజనేయ స్వామివారిని మంత్రి తుమ్మల దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు మంత్రి తుమ్మలకు ఘన స్వాగతం పలికి శాలువా కప్పి సన్మానించారు. ఈ క్రమంలో భద్రాచలం బార్ అసోసియేషన్ వారు మంత్రి తుమ్మలకు పుష్పగుచ్ఛం అందజేసి శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం శాసనసభ్యులు తెల్లం వెంకట్రావు, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, ఖమ్మం సోడా చైర్మన్ పువ్వాడ దుర్గాప్రసాద్, దేవస్థానం ఈవో దామోదర్ రావు, ఆర్ అండ్ బి సి నాగేశ్వరరావు, వ్యవసాయ అధికారి నవీన్ కుమార్, ఇరిగేషన్ డి ఈ వెంకటేశ్వర్లు, తహసిల్దార్ ధనియాల వెంకటేశ్వర్లు, జిపి ఈఓ శ్రీనివాస్ అర్చకస్వాములు తదితరులు పాల్గొన్నారు.



# రోడ్ ఎక్కిన రైతన్నలు

### కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పాలిట శాపంగా మారింది

### సర్పంచ్ పనుమట్టి మమత

**వలిగొండ, మే 14( జనంసాక్షి)**

మండలంలోని టేకుల సోమవారం గ్రామంలో రైతుల ప్ర క్షాన సర్పంచ్ పనుమటి మమత ఆధ్వర్యంలో రైతుల ధర్నా నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ...కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పాలిట శాపంగా మారిందని రైతులు పండించిన పంట కొనుగోలు చేయడంలో ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యే నిర్లక్ష్యం చేస్తున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాలు పడితే రైతుల పరిస్థితి ఏంటని అన్నారు. నిర్లక్ష్యం చేయకుండా తక్షణమే వడ్లు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఎమ్మార్వో దశరథ అక్కడికి చేరుకుని ధాన్యం కొనుగోలు విషయంలో ఎలాంటి అవకతవకలు జరగకుండా, లారీలు సజావుగా అన్లోడ్ చేసుకునే విధంగా చేస్తానని వారు హామీతో ధర్నా విరమించారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో దశరథ, రైతన్నలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా లయన్స్ విజన్ కేర్ సెంటర్ ప్రారంభం

**సూర్యాపేట (జనంసాక్షి):**



జిల్లా కేంద్రంలోని ఎంజీ రోడ్డులో పాత హీరో హోండా షోరూం సమీపంలో శ్రీ వెంకటలక్ష్మి హీరో షోరూం ఎండీ రాచర్ల కమలాకర్ ఆద్వర్యంలో లయన్స్ క్లబ్ ఆఫ్ సూర్యాపేట, లయన్స్ కంటి ఆసుపత్రి సూర్యాపేట వారి సౌజన్యంతో రాచర్ల లక్ష్మి కాంతారావు మెమోరియల్ నిర్వహణలో నూతన విజన్ కేర్ సెంటర్ ను బుధవారం రాత్రి ఘనంగా ప్రారంభించారు.విజన్ కేర్ సెంటర్ లో అన్ని రకాల కంటి పరీక్షలు,కంటి అద్దాలు పరీక్షలు తక్కువ ఖర్చుతో సేవలు లభిస్తాయని లయన్ రాచర్ల కమలాకర్ తెలిపారు.విజన్ కేర్ సెంటర్ నందు పేదలకుకార్పొరేట్ ఆసుపత్రుల తరహా వైద్య సేవలు తక్కువ ఖర్చుతో లభిస్తాయని చెప్పారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ రేపాల మదన్ మోహన్ మాట్లాడుతూ సూర్యాపేట పట్టణంలో లయన్స్ క్లబ్ వారి విజ్ఞప్తి మేరకు రాచర్ల కమలాకర్ ఆద్వర్యంలో ఐదు లక్షల రూపాయల వ్యయంతో అత్యాధునిక ఐ టెస్టింగ్ మెషిన్ ను ఏర్పాటు చేశారని అన్నారు.ఈ సెంటర్ పేద ప్రజలకు చాలా ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. అనంతరం అతిథులను ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో రాచర్ల లక్ష్మి కమలాకర్ దంపతులు, గవర్నర్ ఎలెక్ట్ కెవి ప్రసాద్, వైస్ గవర్నర్ కోడె సతీష్ కుమార్, వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ గుడిపూడి వెంకటేశ్వర రావు,మాజీ ఎమ్మెల్యే, లయన్స్ కంటి ఆసుపత్రి చైర్మన్,దోసపాటి గోపాల్, సెక్రటరీ ఉప్పల రాజేంద్ర ప్రసాద్, కోశాధికారి మీలా మహదేవ్, పెద్దిరెడ్డి గణేష్, బండారు రాజా, కక్కిరేణి చంద్రశేఖర్, మిర్యాల సుధాకర్, రాచర్ల వెంకటేశ్వరరావు, రాచకొండ శ్రీనివాస్,సవరాల సత్యనారాయణ, పోలెబోయిన నర్సయ్య యాదవ్, చల్లా లక్ష్మీకాంత్, చల్లా లక్ష్మిప్రసాద్, గుండా లక్ష్మయ్య, యామా రామ్మూర్తి, హరి, భోనగిరి భాస్కర్, ఐ హాస్పిటల్ మేనేజర్ మల్లికార్జున్, డాక్టర్ హితేష్, విజన్ టెక్నిషియన్ బంగారు స్వాతి తదితరులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో భాగంగా రాచర్ల లక్ష్మి కమలాకర్ పుట్టిన రోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు.లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్, వైస్ గవర్నర్ ఇతర సభ్యుల సమక్షంలో రాచర్ల లక్ష్మి కమలాకర్ కేక్ కట్ చేశారు.ఈ సందర్భంగా వారికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.



### గుర్తుతెలియని కారు ప్రమాదంలో

## వ్యక్తి మృతి

### ఢీ కొట్టి ఈడ్చుకుంటూ వెళ్లిన కారు

**టేకులపల్లి, మే 14 (జనంసాక్షి):**

టేకులపల్లి మండల కేంద్రంలో బుధవారం రాత్రి సుమారు 11 గంటల సమయంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి వెళ్ళాడు. టేకులపల్లి ఎస్సై రాజేందర్ కథనం ప్రకారం... మండలంలోని మూడు తండా కు చెందిన మూడు నాగేష్(46) అనే వ్యక్తి బోడ్ సెంటర్ వైపు నుండి టేకులపల్లి పై సెంటర్ వైపునకు నడుచుకుంటూ వెళ్తుండగా అదే సమయంలో ఇల్లందు వైపు నుండి కొత్తగూడెం వైపునకు వెళుతున్న గుర్తుతెలియని కారును కారు డ్రైవర్ అతివేగంగా నడుపుకుంటూ వెనక నుండి నగేష్ ని ఢీ కొట్టి కొంత దూరం ఈడ్చుకుంటూ వెళ్ళడు. మృతుడు నగేష్ తలకు కాళ్లకు చేతులకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని సోదరుడు మూడు వస్య ఫిర్యాదు మేరకు టేకులపల్లి ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



## కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

**సూర్యాపేట(జనంసాక్షి):**

కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి అన్నారు.గురువారం జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ లో జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యదర్శిగా నియమితులైన షేక్ మీరా ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి ధన్యవాదాలు తెలిపారు.ఈ సందర్భం గా జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శిగా నియమితులైన షేక్ మీరాకు శుభాకాంక్షలు తెలిపి ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పార్టీలో నూతన పదవి స్వీకరణతో బాధ్యత మరింత పెరిగిందని తెలిపారు.కాంగ్రెస్ పార్టీ అన్ని వర్గాల వారిని ఆదరిస్తూ,పార్టీ కోసం పని చేసే వారికి సముచిత స్థానం కల్పిస్తుందని అన్నారు. జిల్లాలో కాంగ్రెస్ పార్టీ పటిష్టతకు పని చేయాలని పేర్కొన్నారు.



## తాళ్లూరి పంచాక్షరయ్యను కలిసిన మంత్రి తుమ్మల

**బూర్గంపహాడ్ మే 14 (జనంసాక్షి)**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, బూర్గంపహాడ్ మండలం ఇరవెండి గ్రామానికి చెందిన తాళ్లూరి పంచాక్షరయ్య ట్రస్టు చైర్మన్ పంచాక్షరయ్యను రాష్ట్ర వ్యవసాయశాఖామంత్రి తుమ్మల నాగేశ్వరరావు గురువారం తన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. రాజకీయాల్లో నాలుగు దశాబ్దాలు పూర్తి చేసుకున్న సందర్భంగా భద్రాద్రి పర్యటనకు వచ్చిన ఆయన శ్రీసీతారామచంద్రస్వామి వారిని దర్శించుకున్న అనంతరం నేరుగా ఇరవెండిలో ఉన్న పంచాక్షరయ్య నివాసానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా తుమ్మలను పంచాక్షరయ్య సాదరంగా ఆహ్వానించి శాలువాతో సత్కరించి అనంతరం జ్ఞాపికను అందజేశారు. అనంతరం తుమ్మల తాళ్లూరితో తాజా రాజకీయ పరిస్థితులు, ప్రజాసమస్యలు, అభివృద్ధి తదితర అంశాలపై కాసేపు ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో తాళ్లూరి ట్రస్టు డైరెక్టర్ వల్లూరిపల్లి వంశీకృష్ణ, సొసైటీ చైర్మన్ బిక్కసాని శ్రీనివాసరావు, తాళ్లూరి రాధాకృష్ణ, తాళ్లూరి చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయ కార్మిక సంఘం మండల నూతన కమిటీ ఎన్నిక

**బూర్గంపహాడ్ మే 14 (జనంసాక్షి)**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా :- వ్యవసాయ కార్మిక సంఘం బూర్గంపహాడ్ మండల కమిటీని జిల్లా కార్యదర్శి రేపాకుల శ్రీనివాస్ గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా బత్తుల వెంకటేశ్వర్లు, ఎస్కో. అబీదాలను ఏకగ్రీవంగా ఎన్నుకోగా సహాయ కార్యదర్శిగా బయ్యా రాము, ఉపాధ్యక్షురాలిగా మరియమ్మలతో పాటు మరో 10 మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మండల అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ ఈ పదవులతో కార్మిక సమస్యలపై తమకు మరింత బాధ్యత పెరిగిందని, కార్మికుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో చిన్నమ్మాయి, పద్మ, కనకదుర్గ, కుర్సా తిరుపతయ్య, మంగ, మీన, శివ తదితరులు పాల్గొన్నారు.

## తుంగతుర్తి మండలంలో ఇద్దరు వ్యక్తుల మృతి



**తుంగతుర్తి మే 14 (జనం సాక్షి)**

తుంగతుర్తి మండల పరిధిలో గురువారం ఇద్దరు వ్యక్తులు మరణించినట్లు స్థానిక ఎస్సై క్రాంతి కుమార్ తెలిపారు, సూర్య తండా ఆవాస గ్రామం గుట్ట కింది తండా కు చెందిన గుగులోతు బిక్షం(57) ఎస్సారెస్పీ పిల్ల కాలువలో చనిపోయి ఉన్నాడని తెలిపారు, మరొక వ్యక్తి జనగామ జిల్లా కొడకండ్ల మండలం నీలిబండ తండా గ్రామపంచాయతీ ఆవాస గ్రామమైన వస్త్రం తండాకు చెందిన భూక్య పంతులు(50) తన కుటుంబంతో మండల పరిధిలోని మానాపురం గ్రామంలో వివాహ కార్యక్రమానికి వెళ్లి అక్కడ భార్యతో గొడవపడి మద్యం మత్తులో తిరిగి వస్తూ బాపన్ భాయ్ తండా దగ్గర చెట్టుకు ఉరివేసుకొని చనిపోయాడు అని తెలిపారు, మృతుల కుమారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## ఉపాధి హామిలో ముమ్మరంగా చెరువుల పూడిక తీత పనులు

### సారవంతమైన మట్టి రైతు పొలాలకు మేలు: ఎంపీడీవో సునీత

**నూతనకల్ మే14 (జనంసాక్షి)**

మండలంలో అన్ని గ్రామాలలో ఉన్న చెరువుల పూడికతీత పనులు ముమ్మరంగా జరుగుతున్నాయని ఎంపీడీవో సునీత అన్నారు గురువారం ఆమె నూతనకల్ శంభుని చెరువులో జరుగుతున్న పనులను పరిశీలించారు ఉపాధి హామీ పనులలో భాగంగా చెరువుల పూడికతీత వలన ఎక్కువ నీటి పరిమాణం నిల్వ ఉంటుంది దీని ద్వారా గ్రౌండ్ వాటర్ శాతం గణనీయంగా పెరుగుతుందని బావులు బోర్లు తక్కువ లోతులో నీరు అందుతుందని సారవంతమైన చెరువు మట్టి రైతు పొలాలకు అన్ని రకాల పంటలకు సమృద్ధిగా పోషకాలు అందుతాయని అధిక దిగుబడి పంటలు పండుతాయని వారు చెప్పారు కూలీల హాజరు పట్టికను పరిశీలించి ఎండ తీవ్రత వలన ఉదయం 6 గంటల నుండి 12 గంటల లోపు పనులు చేయాలని వారు తెలిపారు వేజ్ సీకర్స్ కు త్రాగునీరు నీడ వసతి ఓఆర్ఎస్ ప్యాకెట్లు



అందుబాటులో ఉంచాలని ఫీల్డ్ అసిస్టెంట్ ను ఆదేశించారు ఈ కార్యక్రమంలో సర్పంచ్ మహేశ్వరం మల్లికార్జున్ కార్యదర్శి శర్మ ఫీల్డ్ అసిస్టెంట్ లింగయ్య ఉపాధి కూలీలు తదితరులు పాల్గొన్నారు.

### రైతు పక్షపాతి ప్రభుత్వమిది..

# చివరి గింజ వరకు కొంటాం..

## మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



**నల్లగొండ ప్రతినిధి,మే 14,(జనంసాక్షి):** రైతులు పండించిన చివరి గింజ వరకూ మద్దతు ధర చెల్లించి ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని రాష్ట్ర పౌరసరఫరాలు, నీటిపారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తంకుమార్ రెడ్డి స్పష్టం చేశారు. దేశంలో వరి ఉత్పత్తిలో తెలంగాణ రాష్ట్రం మొదటి స్థానంలో నిలిచిందని కేంద్ర ప్రభుత్వం ప్రకటించిందని ఆయన తెలిపారు.

గురువారం నల్గొండ జిల్లా కనగల్ మండలం చెట్ల చెన్నారం గ్రామంలోని పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా ఇన్‌చార్జి మంత్రి అడ్లూరు లక్ష్మణ్ కుమార్, రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డితో కలిసి ఆయన పరిశీలించారు. అనంతరం రైతులతో సమావేశమై మాట్లాడారు.

ఈ సందర్భంగా మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా రబీ సీజన్‌లో 65 లక్షల ఎకరాల్లో 140 లక్షల మెట్రిక్ టన్నుల వరి దిగుబడి వచ్చిందన్నారు. అందులో 80 నుంచి 90 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయనుందని తెలిపారు. ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా 30 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి, రైతుల ఖాతాల్లో రూ.4600 కోట్లు జమ చేసినట్లు వెల్లడించారు. మరో రెండు మూడు రోజుల్లో 9 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మిల్లులకు తరలించి, రైతుల ఖాతాల్లో అదనంగా రూ.3000 కోట్లు జమ చేయనున్నట్లు చెప్పారు.ధాన్యం కొనుగోలుకు రాష్ట్రవ్యాప్తంగా 8575 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు, 18.67 కోట్ల గన్నీ బ్యాగులు పంపిణీ చేసినట్లు మంత్రి తెలిపారు. ప్రతి కొనుగోలు కేంద్రంలో అవసరమైన సదుపాయాలు కల్పించామని, రవాణా కోసం అవసరమైన అన్ని వాహనాలను వినియోగించుకునేలా జిల్లా కలెక్టర్లకు ప్రత్యేక అధికారాలు ఇచ్చినట్లు పేర్కొన్నారు.

నల్గొండ జిల్లాలో 5.46 లక్షల ఎకరాల్లో 14.65 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం పండిందని మంత్రి తెలిపారు. ఇప్పటివరకు జిల్లాలో 7.24 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి, 53,611 మంది రైతుల ఖాతాల్లో రూ.692 కోట్లు జమ చేసినట్లు చెప్పారు. మరో రూ.400 కోట్లు త్వరలోనే రైతుల ఖాతాల్లో జమ చేయనున్నట్లు వెల్లడించారు. జిల్లాలో 456 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి, కోటి 22 లక్షల గన్నీ బ్యాగులు అందించామని తెలిపారు.ధాన్యం సేకరణలో హమాలీలు, రవాణా సమస్యలు ఎదురైనా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందన్నారు. తాలు, తరుగు పేరుతో రైతులను ఇబ్బంది పెట్టే మిల్లర్లు, ట్రేడర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

జిల్లా ఇన్‌చార్జి మంత్రి అడ్లూరు లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ.. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా గ్రామాల వద్దనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ధాన్యం కొనుగోలు చేస్తున్నామని తెలిపారు. రైతుల ఖాతాల్లో నిర్దేశిత గడువులోనే డబ్బులు జమ అవుతున్నాయని చెప్పారు.

మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ.. ఈ రబీలో గతంతో పోలిస్తే జిల్లాలో 30 వేల మెట్రిక్ టన్నుల అధిక దిగుబడి వచ్చిందన్నారు. బుధవారం ఒక్కరోజే జిల్లాలో 19 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు తెలిపారు. మరో పది రోజుల్లో ధాన్యం కొనుగోలు పూర్తిచేస్తామని చెప్పారు. ఎస్ఎల్‌బీసీ సొరంగం పూర్తైతే జిల్లాలో మరింత సాగు విస్తీర్ణం పెరిగి దిగుబడులు అధికమవుతాయని పేర్కొన్నారు.కార్యక్రమంలో ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్, ఎస్పీ శరత్చంద్ర పవర్ తదితరులు పాల్గొన్నారు.



### వరి ధాన్యం సేకరణలో రాష్ట్ర ప్రభుత్వం

# పూర్తిగా విఫలం

**తుంగతుర్తి మే 14 (జనం సాక్షి)**

మాజీ ఎంపీపీ మండల పార్టీ అధ్యక్షుడు తాటికొండ సీతయ్య ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు ధాన్యం పోసి నెల రోజులుదాటినా ఇప్పటివరకు పావు వంతు ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయలేదని దీంట్లో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా పూర్తిగా విఫలం చెందిందని మాజీ ఎంపీపీ బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు తాడికొండ సీతయ్య అన్నారు, గురువారం పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రైతులు తమ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో పోసి రోజుల తరబడి కాంటా కోసం ఎదురుచూస్తున్నారని అన్నారు, ఒకవేళ కాంటా అయిన లారీలు సక్రమంగా కేంద్రాలకు రాకపోవడం తో రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు, ఒకపక్క వాతావరణం లో మార్పులు రావడంతో వర్షాలు వస్తే తమ ధాన్యం పూర్తిగా తడిసిపోతుందని ఆందోళనలో ఉన్నారని అన్నారు, లోడింగ్ చేసి పంపిన లారీ మిల్లుల వద్ద సకాలంలో దిగుమతులు కాపోవడం తో రైతులకు ఎదురుచూపులు చూస్తున్నారని అన్నారు, ధాన్యం కల్లా ల వద్ద పడిగాపులు కాసే పరిస్థితి ఏర్పడిందని అన్నారు. కాంత అయిన ధాన్యాన్ని మిల్లులకు పంపిస్తే మిల్లు యజమానులు తరుగు పేరుతో తాలు పేరుతో కిలోల కొద్ది కోతలు పెడుతుండడం తో రైతులు ఆందోళన స్థితిలో ఉన్నారని అన్నారు. గత పదేళ్లు కెసిఆర్ పాలనలో రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఎలాంటి ఇబ్బందులు పడలేదని అన్నారు. ఎన్నికల ముందు రైతులకు అనేక హామీలు ఇచ్చి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కనీసం రైతులకు రైతు భరోసా, రైతుబంధు, రుణమాఫీ సక్రమంగా అమలు చేయలేదని విమర్శించారు కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న విధానాలతో వ్యవసాయ. రంగం పూర్తిగా సంక్షోభంలో కూరుకుపోయిందని అన్నారు. ఇప్పటికైనా అధికారులు ప్రజాప్రతినిధులు స్పందించి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించి ధాన్యం కొనుగోలు వేగవంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు ఈ సమావేశంలో బిఆర్ఎస్ నాయకులు ఉప్పల నాగమల్లు మాజీ సర్పంచ్ యాకు నాయక్, పూర్ణ నాయక్. రాములు నాయక్. నల్లబెల్లి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు

## ముత్తిరెడ్డిగూడెం జడ్.పి.హెచ్.ఎస్ లో వైభవంగా 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక'.. ప్రతిభావంతులైన విద్యార్థులకు భారీ నగదు బహుమతులు!

**మోటకొండూరు, మే 14 (జనంసాక్షి):** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక" కార్యక్రమంలో భాగంగా నాల్గవ రోజు ముత్తిరెడ్డిగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తలి దండ్రుల-ఉపాధ్యాయుల సమావేశం గురువారం అత్యంత ఘనంగా జరి గింది. ఈ సమావేశంలో విద్యార్థుల ప్రతిభను గుర్తించి, వారిని ప్రోత్సహిం చేందుకు గ్రామ పెద్దలు, ఎన్నారైలు ముందుకు రావడం విశేషం.

### ప్రతిభకు పట్టాభిషేకం

మార్చి 2026 పదో తరగతి పరీక్షల్లో అత్యున్నత మార్కులతో ఉత్తీర్ణులైన విద్యార్థులను ఈ సందర్భంగా ఘనంగా సత్కరించారు. గ్రామ పెద్ద, పాఠశాల శ్రేయోభిలాషి చాడ శశిధర్ రెడ్డి కుమారుడు, ఎన్నారై చాడ సాయి కిరణ్ విద్యార్థులకు నగదు బహుమతులను అందజేశారు ,మంచాల దీక్షిత ఇంటర్ సెకండ్ ఇయర్ లో 990/1000 మార్కులు సాధించినందుకు ?5,000/- బహుమతి,అన్నెబోయిన జయగణేష్ ఇంటర్ ఫస్ట్ ఇయర్ లో 459/470 మార్కులు సాధించినందుకు ?2,500/-బహుమతి.దుంప సంధ్య పదో తరగతిలో 538/600 మార్కులు సాధించినందుకు ?2,500/- బహుమతిని అందజేశారు.

### సర్పంచ్ ఆదర్శం - ఉచిత ప్రయాణ సౌకర్యం

గ్రామ సర్పంచ్ బుడిగె బాలరాజు మాట్లాడుతూ.. రాబోయే 'బడిబాట' కార్యక్రమంలో తాను స్వయంగా పాల్గొంటానని ప్రకటించారు. అంత ేకాకుండా, కాటేపల్లి, కొండాపూర్, మరియు నాంచారిపేట గ్రామాల నుండి వచ్చే విద్యార్థుల కోసం తన సొంత ఖర్చులతో ఆటో సౌకర్యం కల్పి స్తానని సభాముఖంగా ప్రకటించారు. సర్పంచ్ తీసుకున్న ఈ నిర్ణయం పట్ల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం మరియు తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమం లో సర్పంచ్ బుడిగె బాలరాజుతో పాటు చాడ శశిధర్ రెడ్డి, మంచాల సత్యనారాయణ, అన్నెబోయిన నాగయ్య, గంధమల్ల పాండు, సొప్పరి నర్సింహా, పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు మరియు విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# 12 ఏళ్ల తర్వాత రైతులు గుర్తొచ్చారా..?

- ○ఎమ్మెల్యేగా ఉన్న కాలంలో ధృతరాష్ట్రుడిలా వ్యవహరించారు
- ○కొనుగోలు కేంద్రాలపై ఎప్పుడైనా సమీక్ష చేశారా..?
- ○నిరూపిస్తే అంబేద్కర్ విగ్రహం వద్ద క్షమాపణ చెబుతా
- ○మాజీ ఎమ్మెల్యేకు అందేల లింగం యాదవ్ సవాల్



**భూదాన్ పోచంపల్లి, మే 14 (జనంసాక్షి ):** జూలూరు పిఎసిఎస్ చైర్మన్ అందేల లింగం యాదవ్ గురువారం భూదాన్ పోచంపల్లి పట్టణ కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డిపై తీవ్ర విమర్శలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పైళ్ల శేఖర్ రెడ్డి 12 సంవత్సరాల రాజకీయ కాలంలో 10 సంవత్సరాలు ఎమ్మెల్యేగా, రెండు సంవత్సరాలు ప్రతిపక్ష నాయకుడిగా ఉన్నప్పటికీ ఒక్కరోజైనా వడ్ల కొనుగోలు కేంద్రాలకు వెళ్లి రైతుల సమస్యలు తెలుసుకోలేదన్నారు. కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి వెళ్లిపోవడం తప్ప రైతుల ఇబ్బందులపై సమీక్ష చేసిన దాఖలాలు లేవని విమర్శించారు. ఈ ప్రాంతంలో ఏ గ్రేడ్‌లో ఉన్న వడ్లను బి గ్రేడ్‌కు మార్చడంలో అప్పటి ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యమే ప్రధాన కారణమని ఆరోపించారు. ఎమ్మెల్యేగా ఉన్న కాలంలో పైళ్ల శేఖర్ రెడ్డి ధృతరాష్ట్రుడిలా వ్యవహరించారని విమర్శించారు. గతంలో ఎన్నిసార్లు సమస్యను దృష్టికి తీసుకెళ్లినా స్పందించలేదని అన్నారు. ఇప్పుడు రైతుల సమస్యలపై మాట్లాడుతున్న పైళ్ల శేఖర్ రెడ్డికి 12 ఏళ్ల తర్వాత జ్ఞానోదయం అయిందా అని ప్రశ్నించారు. ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో కొనుగోలు కేంద్రాలపై ఒక్కసారి అయినా సమీక్ష నిర్వహించినట్లు ఆధారాలు చూపించాలని, అలా నిరూపిస్తే అంబేద్కర్ విగ్రహం వద్ద క్షమాపణ చెబుతానని సవాల్ విసిరారు. గతంలో రైతులతో కలిసి ఎమ్మార్వో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి సమస్యలను అప్పటి ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లినా స్పందన రాలేదని అందేల లింగం యాదవ్ ఆరోపించారు.

# బక్రీద్ పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలి - డి ఎస్ పి

**మణుగూరు, మే 14 (జనంసాక్షి):**
బక్రీద్ పండగ అందరితో ప్రశాంతంగా జరుపుకోవాలని గోవధ నిషేధ చట్టాలను పాటించాలని మణుగూరు సబ్ డివిజనల్ అధికారి వంగా రవీందర్ రెడ్డి అన్నారు. గురువారం మణుగూరు డిఎస్పి కార్యాలయంలో హిందూ, ముస్లిం సోదరులు, రాజకీయ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అందరూ కలిసి మెలిసి బక్రీద్ పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని అన్నారు. ఎక్కడైనా గోవులు రవాణా చేస్తే పోలీస్ లకు సమాచారం ఇవ్వాలని, చట్టాన్ని మీ చేతుల్లోకి తీసుకోవద్దని అన్నారు. సోషల్ మీడియాలో హిందూ, ముస్లిం, ఘటనలో వివాధస్పదమైన అనుబంధ విషయాలపై తప్పుడు ప్రచారం చేస్తే కఠిన చర్యలు తప్పవు అన్నారు. సోషల్ మీడియాలో రెచ్చగొట్టే మెసేజ్ లు చేస్తే స్థానిక పోలీస్ లకు సమాచారం అందించాలన్నారు. బక్రీద్ కేవలం జంతువులను బలివ్వడం కాదు తమలోని ఆహింకారాన్ని దురాశను త్యాగం చేయాలనేది దీని ముఖ్య ఉద్దేశం అన్నారు. నిబంధనలకు లోబడి మత సామరస్యం తో ఈ పండుగను జరుపుకోవాలని కోరారు. ఈ సమావేశంలో మున్సిపాలిటీ కమిషనర్ ప్రసాద్, వెటర్నరీ డాక్టర్ సరస్వతి, మణుగూరు సిఐ నాగబాబు, ఈ బయ్యారం సిఐ వెంకటేశ్వర్లు, అశ్వాపురం సిఐ అశోక్ రెడ్డి, ఎస్సై నగేష్ కుమార్, రాజకీయ పార్టీలు, ముస్లిం సోదరులు, హిందు సోదరులు తదితరులు పాల్గొన్నారు.







## ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే జారే

**చంద్రుగొండ, మే 14 (జనంసాక్షి):**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట నియోజకవర్గం చంద్రుగొండ మండలం బెండాలపాడు గ్రామ పంచాయతీలో నిర్వహించిన ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశాలు, వివాహ శుభకార్యాలలో అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ పాల్గొన్నారు. బుధవారం రాత్రి జరిగిన ఈ కార్యక్రమాలకు స్థానిక ప్రజల ఆహ్వానం మేరకు ఎమ్మెల్యే హాజరై శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ బొర్రా లలిత, దిశ కమిటీ సభ్యుడు బొర్రా సురేష్, సేవాదళ్ ప్రధాన కార్యదర్శి ఫజల్ బక్షీతో పాటు స్థానిక కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. బెండాలపాడు, బాలికుంట గ్రామాల్లో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశ వేడుకలకు హాజరైన ఎమ్మెల్యే లబ్ధిదారుల కుటుంబ సభ్యులను కలుసుకుని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో అంకిరెడ్డి కిష్టారెడ్డి, నల్లమోతు రమణ, మాళోత్ భోజ్యనాయక్, వీసం రాములు, కారం వెంకటేశ్వర్లు, కారం సైదులు, సపావట్ రాజేష్, బాటి రామారావు, అలకుంట రాందాసు, బోడ శ్రీను, బోడ బాలు, కారం శ్రీను తదితర నాయకులు, మహిళా నాయకులు రమణ, రాజేశ్వరి, ఈశ్వరి, రాధ మరియు నియోజకవర్గానికి చెందిన పలువురు కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.



# ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య: ఎంఈఓ సూరయ్య

### విద్యా వారోత్సవాలు మే 11 నుంచి 17 వరకు

**చంద్రుగొండ, మే 14 (జనంసాక్షి):**
ప్రత్యేక విద్యా వారోత్సవాలలో భాగంగా గురువారం చంద్రుగొండ మండలంలోని అన్ని పాఠశాలల్లో బడిబాట కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి సూరయ్య పాల్గొని విద్యార్థుల నమోదు పెంపు, విద్యా ప్రమాణాల అభివృద్ధిపై ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మండలంలోని కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ఎంఆర్సీ సిబ్బంది, ఎంఐఎస్‌లు, సీఆర్‌పీలు బడిబాట కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి బడి బయట ఉన్న పిల్లలను గుర్తించి పాఠశాలల్లో చేర్పించేందుకు చర్యలు చేపట్టారు. వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక బోధన అందించి వారిని విద్యలో ముందుకు తీసుకువచ్చేలా కృషి చేయాలని ఎంఈఓ సూరయ్య సూచించారు. అలాగే 2026,27 విద్యాసంవత్సరానికి ప్రతి పాఠశాలలో కనీసం పది శాతం విద్యార్థుల సంఖ్య పెంచే లక్ష్యంతో పనిచేయాలని తెలిపారు. ప్రతి విద్యార్థికి ఆధార్ నమోదు పూర్తి చేయడంతో పాటు పాఠశాలలు ప్రారంభమయ్యేలోపు పాఠ్యపుస్తకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. బడికి దూరమైన పిల్లలను తిరిగి పాఠశాలల్లో చేర్పించడం, ప్రభుత్వ విద్యను మరింత బలోపేతం చేయడం బడిబాట కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని ఎంఈఓ సూరయ్య పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చంద్రుగొండ జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉప్పల్ రెడ్డి, ఉపాధ్యాయులు సిఆర్పి సేవియా తదితరులు పాల్గొన్నారు.



## ప్రభుత్వ బడుల బలోపేతానికి అందరూ సహకరించాలి

### మున్సిపల్ చైర్మన్ తడక వెంకటేశ్వర్లు

**భూదాన్ పోచంపల్లి, మే 14 (జనంసాక్షి):**
ప్రతి తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి ప్రభుత్వ బడులను బలోపేతం చేయాలని మున్సిపల్ చైర్మన్ తడక వెంకటేశ్వర్లు అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా గురువారం పట్టణ కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో ఆయన పాల్గొని కరపత్రాన్ని విడుదల చేసి బడిబాటను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను కూడా ఇదే ప్రభుత్వ పాఠశాలలో చదివానని గుర్తు చేసుకున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతోందని, విద్యార్థుల భవిష్యత్తు కోసం తల్లిదండ్రులు ప్రభుత్వ బడులపై విశ్వాసం ఉంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో జీసీడీఓ రాధ, ప్రధానోపాధ్యాయులు వై కృష్ణయ్య, బ్రహ్మాచారి అలివేలు, రమాదేవి, సోమిరెడ్డి, వెంకటేశ్వర్లు, స్వర్ణలత, రజిత, కృష్ణ మల్లారెడ్డి, జోసెఫ్, వేదిక్ మ్యాథ్స్, మనోహర్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.




# ధాన్యం కొనుగోలులో దగా

## రైతుల రక్తం తాగుతున్న తరుగు మాఫియా!

### ○నూక శాతం పేరుతో రెండు కిలోలు ○లారీలు వెయిటింగ్ చేసినందుకు చార్జీలు

**వలిగొండ, మే 14 (జనంసాక్షి)**
భారతీయ జనతా పార్టీ వలిగొండ మండల శాఖ అధ్యక్షుడు బోళ్ల సుదర్శన్ ఆధ్వర్యంలో నాగారం గ్రామంలో వడ్లు కొనుగోలు సెంటర్ ను సందర్శించడం జరిగింది. అక్కడ రైతులు పడుతున్న అనేక ఇబ్బందులను వారిని అడిగి తెలుసుకోవడం జరిగింది. ముఖ్యంగా రైతులు వారి దృష్టికి తీసుకువచ్చిన విషయాలు మిల్లర్లు ధాన్యాన్ని దించుకోకపోవడం. కారణం ఏమనగా ధాన్యంలో తాలు,నూక శాతం ఎక్కువగా ఉందని ,అందుకుగాను ప్రతి బస్తాకు రెండు కిలోల తరుగు చేస్తున్నారని వారు తెలియజేయడం జరిగింది. ఇప్పటికే ఐకెపి సెంటర్లలో 41 కిలో 500 గ్రాములు ప్రతి బస్తా తూకం వేసిన, మరల నూక శాతం పేరుతో బస్తాకు రెండు కిలోల తరుగు చేయడం జరుగుతుందని, లోడుతో వెళ్లిన లారీలను అన్లోడ్ చేసుకోకుండా అక్కడే వెయిటింగ్ చేయించడం వలన , లారీలవారు రైతుల వద్ద వెయిటింగ్ చార్జీలు వసూలు చేయడం జరుగుతుంది. లారీ యజమానులు అందరూ సిండికేట్ అయి తమకు అనుగుణంగా ఉన్న వారి యొక్క ధాన్యం బస్తాల వద్దకు లారీలను పంపడం జరుగుతుందని రైతులు వివరించడం జరిగింది. ఈ అన్ని విషయాల పైన అక్కడ ఉండే ఐకెపి నిర్వాహకురాలను ఆరా తీయగా, మిల్లర్లు తెలియజేసిన విషయాలను మేము రైతులకు చెప్తున్నా మని, మాకు ఎలాంటి సంబంధం లేదని తెలియజేయడం జరిగింది. ఇట్టి విషయాన్ని స్థానిక ఎమ్మార్వో దృష్టికి తీసుకువెళ్లగా వారు మిల్లర్లతో, లారీల యజమానులతో మాట్లాడి రైతులకు ఎలాంటి ఇబ్బందులు జరగకుండా చూస్తానని భారతీయ జనతా పార్టీ నాయకులకు తెలియజేయడం జరిగింది. అందుకు భారతీయ జనతా పార్టీ నాయకులు ఎక్కడ రైతుకు ఇబ్బంది జరిగిన స్థానిక తాసిల్దార్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు బంధారపు లింగస్వామి, రాజకొండ కృష్ణ, మహిళా మోర్చా జిల్లా కార్యదర్శి మందుల లక్ష్మి, మంద నరసింహ, బిజెపి మండల పదాధికారులు మందుల నాగరాజు, మందడి రంజిత్ రెడ్డి, గంగాధరీ దయాకర్, కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు కొత్త రామచంద్రం యాదవ్, బూత్ అధ్యక్షులు గొలనుకొండ అశోక్ తదితరులు పాల్గొన్నారు.



# బండి భగీరథ్‌ను అరెస్టు చేసి శిక్షించాలి

## బండి భగీరథ్ దిష్టిబొమ్మ దగ్ధం



**ఖమ్మం, (జనంసాక్షి) :**
ఇటీవల ఒక మైనర్ బాలికకు మద్యం తాగించి హత్యాచారానికి పాల్పడ్డ బండి భగీరథ్ ను వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని సిపిఐ(ఎం) ఖమ్మం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. గురువారం పార్టీ ఖమ్మం డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో ఎన్ ఎస్ టి రోడ్ వద్ద బండి భగీరథ్ దిష్టిబొమ్మ దగ్ధం చేశారు . ఈ సందర్భంగా నున్నా నాగేశ్వరరావు పాల్గొని మాట్లాడుతూ కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తనయుడు బండి భగీరద్ తండ్రి అధికారాన్ని అడ్డుపెట్టుకొని ఇలాంటి నీచానికి పాల్పడటం సిగ్గుచేటు అని ఈ ఘటనను యావత్తు దేశ ప్రజలందరూ ఖండిస్తున్నా కేంద్ర ప్రభుత్వానికి చీమకుట్టినట్లు అయినా లేదని నున్నా నాగేశ్వరరావు విమర్శించారు. బండి సంజయ్ భావోద్వేగ ప్రసంగాల ద్వారా కొడుకు క్రూరుడుగా మారదని, బండి సంజయ్ ప్రసంగాల్లో కూల్చటం, చీల్చడం, తొక్కడం, చంపడం, శివాలు, శవాలు అని రెచ్చగొట్టే మాటలు మాట్లాడటం వల్ల కుమారుడు కూడా ఆయన అడుగుజాడల్లో నడుస్తూ నేను ఏ నేరం చేసిన నన్ను ఎవరు ఏమి చేయలేదు అహంకారంతో తన తండ్రి తన వెనుక ఉన్నాడని భరోసాతో నన్ను కాపాడుతాడు అని నమ్మకంతో ఇలాంటి నిజమైన పనులకు ఒడిగడుతున్నాడని అని ఆరోపించారు. గతంలో కూడా తన తోటి విద్యార్థుల పై అరాచకంగా దాడి చేసిన ఘటనలు కూడా మన ముందున్నాయని అప్పుడే అతనిపై చర్య తీసుకుని ఉంటే ఇప్పుడు ఈ నేరానికి పాల్పడి ఉండేవాడు కాదని ఇప్పటికైనా పోలీస్ యంత్రాంగం, రాష్ట్ర ప్రభుత్వం అతనిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకొని శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనకి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర మంత్రి పదవికి బండి సంజయ్ రాజీనామా చేయాలని లేని పక్షంలో కేంద్ర ప్రభుత్వం అతన్ని పదవి నుంచి తొలగించాలని నున్నా నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. మహిళల పట్ల బిజెపి పార్టీ ఎంత చులకన భావంతో ఉన్నదో ఎంత లెక్కలేని తనంతో ఉన్నదో అనేక ఘటనలు రుజువు చేస్తున్నాయని బిజెపి నాయకులు ఒక్కొక్కలుగా మహిళలపై విరుచుకుపడుతున్నారని మహిళలకు చదివు ఎందుకని మాట్లాడుతున్నారని మహిళలు రాజకీయాల్లోకి రాకూడదని కుట్రబుద్ధితో మహిళా రిజర్వేషన్ బిల్లును కూడా అమలు చేయడం లేదని ఈ సందర్భంగా నున్నా నాగేశ్వరరావు విమర్శించారు. ఈ కార్యక్రమంలో పార్టీ ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై విక్రమ్, నాయకులు దొంగల తిరుపతిరావు, భుక్యా శ్రీనువాసురావు, పి నాగసులోచన, ఉపేంద్ర, మాజీ కార్పొరేటర్లు యర్రా గోపి, ఎల్లంపల్లి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు





### కబేళాలకు తరలించేందుకు సిద్ధంగా ఉన్న

# 122 పశువుల పట్టివేత

## ఒక లారీ సీజ్.. పలువురు అదుపులోకి

**చంద్రుగొండ, (జనంసాక్షి):**
కబేళాలకు అక్రమంగా తరలించేందుకు సిద్ధంగా ఉంచిన 122 పశువులను చంద్రుగొండ పోలీసులు చాకచక్యంగా పట్టుకొని గోశాలకు తరలించిన ఘటన మండల పరిధిలో చోటుచేసుకుంది. ఈ ఘటనకు సంబంధించి పలువురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. చంద్రుగొండ ఎస్సై శివరామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశా రాష్ట్రంలోని నవరంగ్‌పూర్ ప్రాంతం నుంచి హైదరాబాద్ కబేళాలకు పశువులను తరలించేందుకు కొంతమంది వ్యక్తులు పన్నాగం పన్నారు. ఇందులో భాగంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చంద్రుగొండ మండలం తిప్పనపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని మహమ్మద్‌నగర్ గ్రామంలో పశువులను డంప్ చేసి ఉంచారు. ఈ విషయమై చంద్రుగొండ పోలీసులకు నమ్మదగిన సమాచారం అందడంతో పోలీసులు అక్కడికి చేరుకుని తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో మొత్తం 122 పశువులు లభ్యమయ్యాయి. వీటిలో 44 ఆవులు, 78 ఎద్దులు ఉన్నట్లు గుర్తించారు. అదేవిధంగా పశువుల తరలింపుకు ఉపయోగిస్తున్న ఒక లారీని కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన పశువులను పాల్వంచలోని గోశాలకు తరలించినట్లు ఎస్సై తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి పూర్తి స్థాయిలో దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు చంద్రుగొండ పోలీసులు వెల్లడించారు.

# వరికి మద్దతు ధర పెంచిన ఘనత పీఎం నరేంద్ర మోడీదే



**తుంగతుర్తి మే 14 (జనం సాక్షి)**
వరి పంటలతో పాటు ఇతర పంటలకు మద్దతు ధర పెంచిన ఘనత ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి దక్కిందని బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి తుంగతుర్తి గ్రామ సర్పంచ్ మల్లెపాక సాయిబాబా అన్నారు, గురువారం తుంగతుర్తిలో విలేకరుల సమావేశం మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం ఏర్పడిన అనంతరం రైతుల శ్రేయస్సు కోసం మద్దతు ధర పెంచడంతోపాటు రైతుల కోసం ఎరువుల పైన వేలకోట్ల రూపాయలు సబ్సిడీ ఇచ్చి రైతుల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తుందని అన్నారు, కల్లాలలోని వడ్లను వెంటనే కాంటాలు వేసి తరలించాలని అన్నారుమొక్కజొన్న, సజ్జలు, రాగులు, పెసలకు మద్దతు ధర పెంచడంతో రైతులకు ఎంతో మేలు జరుగుతుందని అన్నారు రాష్ట్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాల్ల జాప్యం కి రాష్ట్ర ప్రభుత్వమే కారణం అన్నారు కల్లాలలోని వడ్లను వెంటనే కాంటాలు వేసి తరలించాలని అన్నారు.

### యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో ప్రధాని మోడీ దిష్టిబొమ్మ దహనం

**తుంగతుర్తి మే 14 (జనం సాక్షి)**
నీట్ ప్రశ్నపత్రాల లీకేజీని ఖండిస్తూ మండల కేంద్రంలోని మెయిన్ రోడ్డుపై యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో గురువారం మెయిన్ రోడ్ పై ప్రధానమంత్రి దిష్టి బొమ్మను దగ్ధం చేశారు, ఈ సందర్భంగా యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు కోరుకొప్పుల నరేష్ గౌడ్ మాట్లాడుతూ నీట్ ప్రశ్న పత్రం లీకేజ్ కావడంతో దేశవ్యాప్తంగా 22 లక్షల మంది విద్యార్థుల జీవితాలను అనిశ్చితిలోకి కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం నెట్టిందని విమర్శించారు. నీట్ ప్రశ్నపత్రాల లీకేజీకి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సోషల్ మీడియా స్టేట్ కోఆర్డినేటర్ కొండ రాజు, యువజన కాంగ్రెస్ వివిధ మండలాల అధ్యక్షులు సృజన్, ఎల్లేష్, పసుల అశోక్, వాలీ, జిల్లా యువజన నాయకులు సుదగాని శివ, కౌశిక్ గౌడ్, పట్టణ అధ్యక్షులు రాంబాబు, శ్రీకాంత్, యూత్ కాంగ్రెస్ నాయకులు అక్బర్ షేక్ , బొలక సైదులు, అక్కినపల్లి నరేష్, నవీన్, వంశీ, లింగస్వామి, సురేష్ కమటం సాయి, కొంపల్లి సాయి, అక్రమ్, మురళి, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.







### మణుగూరు కోర్టు ఆవరణలో

# న్యాయ చైతన్య సదస్సు

- మానవ అక్రమ రవాణా, పోక్సో చట్టాలపై అవగాహన..
- ముఖ్య అతిథిగా పాల్గొన్న మణుగూరు మెజిస్ట్రేట్ సూరి రెడ్డి

**మణుగూరు, మే 14 (జనంసాక్షి):**
ప్రజలు తమ హక్కుల పరిరక్షణకు చట్టా లను తెలుసుకోవటం ఎంతో అవసరమని ప్రథమ శ్రేణి జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కంబపు సూరి రెడ్డి అన్నారు. లీగల్ ఎయిడ్ కౌన్సిల్ న్యాయవాది వీరంకి పద్మావతి ఆధ్వర్యంలో గురువారం మణుగూరు కోర్ట్ ఆవరణలో న్యాయ చైతన్య సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల లీగల్ అథారిటీ చైర్మన్, ప్రథమ శ్రేణి జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కంబపు సూరి రెడ్డి హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మానవ అక్రమ రవాణా, వాణిజ్య దోపిడీ నిరోధక పథకం 2015 కింద బాధితులకు అందే న్యాయ సహాయం, రక్షణ చర్యలు, ప్రభుత్వ పునరావాస అవకాశాలను వివరించారు. అలాగే జాగృతి పథకం–2025లో భాగంగా సురక్షిత్ బచ్‌పన్ సురక్షిత్ భవిష్య కార్యక్రమం ద్వారా చిన్నారుల రక్షణ, పోక్సో చట్టం నిబంధనలు, బాలల హక్కుల పరిరక్షణపై కక్షిదారులకు అవగాహన కల్పించారు. పలువురు న్యాయవాదులు వివిధ చట్టాలపై ప్రజలకు అవగాహన తో పాటు లీగల్ ఎయిడ్ సేవలను వినియోగించకోవాలని సూచనలు అందించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు గురు కృష్ణ, న్యాయవాదులు కందిమల్ల నరసింహారావు, జాడి చొక్కారావు, కుర్మ విజయ్, మేదరమెట్ల శ్రీనివాసరావు, రామ్మోహన్ రావు, ఈర్ల రాము, పోశం భాస్కర్, బిక్కసాని శ్రీనివాస్, బొంతు సునీత, తాటి వందన, వాసవి, లీగల్ సెల్ కోఆర్డినేటర్ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

# చంద్రుగొండ మండల కాంగ్రెస్ అధ్యక్షునిగా నల్లమోతు వెంకటరమణ



**చంద్రుగొండ, మే 14 (జనంసాక్షి):**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చంద్రుగొండ మండలం మద్దుకూరు గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు నల్లమోతు వెంకటరమణను చంద్రుగొండ మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షునిగా నియమిస్తూ పార్టీ అధిష్టానం లేఖ విడుదల చేసింది. ఈ సందర్భంగా నల్లమోతు వెంకటరమణను జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్న, అశ్వరావుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, చంద్రుగొండ మండల కాంగ్రెస్ నాయకులు అంకిరెడ్డి కృష్ణారెడ్డి, బొజ్యా నాయక్, గుగులోతు బాబు, మండలంలోని వివిధ గ్రామ పంచాయతీల సర్పంచులు, ముఖ్య నాయకులు అభినందించారు. ఈ సంద ర్భంగా నల్లమోతు వెంకటరమణ మాట్లాడుతూ తనను మండల కాంగ్రెస్ అధ్యక్షునిగా ఎంపిక చేసిన రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, మండల పార్టీ నాయ కత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. మండలంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేస్తూ, ఎటువంటి భేదాభిప్రాయాలు లేకుండా, గ్రూప్ రాజకీయాలకు తావులేకుండా అందరినీ కలుపుకుని ముందుకు సాగుతానని పేర్కొన్నారు.

### బిజెపి రాష్ట్ర అధ్యక్షుడిని కలిసిన కేతావత్ భాస్కర్ నాయక్



**తిరుమలగిరి (సాగర్) మే 14 (జనంసాక్షి):**
తెలంగాణ రాష్ట్ర బిజెపి అధ్యక్షుడు ఎన్ రామచంద్రావును హైదరాబాదులోని ఆయన నివాసంలో గురువారం రాష్ట్ర బిజెపి ఎస్టీ మోర్చా అధికార ప్రతినిధి కేతావత్ భాస్కర్ నాయక్ కలిశారు. ఈ సందర్భంగా ఇటీవల హైదరాబాదులో జరిగిన ప్రధాని మోడీ సభ విజయవంతం కావడంతో ఆయనకు ధన్యవాదాలు తెలిపి, శాలువాతో సన్మానం చేశారు. ఈ సందర్భంగా రామచంద్రరావు వచ్చే ఎన్నికలలో నాగార్జునసాగర్ నియోజకవర్గంలో బిజెపి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని, ఆ దిశగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి యువతను బిజెపి పార్టీతో పని చేసే విధంగా కృషి చేయాలని సూచించారు అన్నారు.



## కీటక జనిత నిర్మూలనలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలి

### సర్పంచ్ డాక్టర్ వేమూరి సత్యనారాయణ

**మునగాల, మే 14(జనంసాక్షి):**
మండల పరిధిలోని నర్సింహాపురం గ్రామపంచాయతీ ఆవరణలో 99 రోజుల పాటు జరిగే ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో బాగంగా గురువారం దోమల నివారణ, పరిసరాల పరిశుభ్రత వ్యక్తిగత ఆరోగ్యంపై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమం స్థానిక సర్పంచ్ డాక్టర్ వేమూరి సత్యనారాయణ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా వైద్య అధికారులు గ్రామ ప్రజలకు దోమల నివారణకు పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ సత్యనారాయణ మాట్లాడుతూ, ప్రతి ఒక్కరు. వైద్య సిబ్బంది సూచించిన విధంగా దోమల నియంత్రణకు, మలేరియా, డెంగ్యూ వ్యాధుల భారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని, అలాగే వ్యక్తిగత పరిశుభ్రతను పాటిస్తూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఆరోగ్యమే మహాభాగ్యం అని, గ్రామాన్ని ఆరోగ్య రహిత గ్రామంగా తీర్చి దిద్దడానికి ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు పచ్చిపాల నరేష్, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు, జిల్లా మండల వైద్య సిబ్బంది పి. రవీందర్, ం. మోతిలాల్, సురేందర్, అమర్ కుమార్, వినోద్, దివ్య, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు, గ్రామ పెద్దలు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం

**మునుగోడు, మే 14(జనం సాక్షి)**
తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని, పాఠశాలల బలోపేతానికి సహకరించాలని మునుగోడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాల ప్రసాద్ అన్నారు. గురువారం ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలను గురించి గ్రామస్తులకు తెలిపారు. అనుభవజ్ఞులైనవ్ ఉపాధ్యాయులచే విద్యాబోధన మౌలిక వసతులు,మధ్యాహ్న భోజనం, ఉచిత యూనిఫాం పుస్తకాలు అందించడం జరుగుతుందని, ప్రతి ఒక్కరూ తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మునుగోడు మండల విద్యాధికారి టి.మల్లేష్ , పాఠశాల ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.





## అమృత్ పథకం పనులు వేగవంతం చేయాలి

**హాలియా, మే 14 జనంసాక్షి:**
అమృత్ పథకం కింద సాగర్ రోడ్డులోని ఎంఎల్ఆర్ వెంచర్ ప్రాంతంలో నిర్మాణంలో ఉన్న నీటి నిల్వ ట్యాంకుల పనులను ప్రజారోగ్య శాఖ ఉన్నతాధికారి వెంకటేశ్వర్లు పరిశీలించారు. నిర్మాణ పనుల పురోగతిని ప్రత్యక్షంగా పరిశీలించి అధికారులతో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా హాలియా మున్సిపల్ చైర్మన్ చింతల చంద్రారెడ్డి మాట్లాడుతూ, అమృత్ పథకం కింద చేపట్టిన నాలుగు నీటి ట్యాంకుల నిర్మాణ పనులను మరింత వేగవంతం చేయాలని సూచించారు. అవసరమైన మేరకు కార్మికులను పెంచి పనులను త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.ఈ పర్యవేక్షణ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె. రవీందర్ రెడ్డి, ప్రజారోగ్య శాఖ అధికారులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## జర్నలిస్టుల ఐక్యతతోనే హక్కుల సాధన సాధ్యమవుతుంది

### జర్నలిస్టులు దారి తప్పితే సమాజానికే ప్రమాదం

### టియూడబ్ల్యూజె (ఐజెయు) డివిజన్ అధ్యక్షుడు గాదె గిరిధర్ రావు

**కొండమల్లేపల్లి, మే 14 (జనంసాక్షి):**
జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తూ జర్నలిస్టుల హక్కుల సాధనకు టియూడబ్ల్యూజె (ఐజెయు) సంఘం అండగా ఉంటుందని దేవరకొండ డివిజన్ అధ్యక్షుడు గాదె గిరిధర్ రావు తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని పాల శీతలీకరణ కేంద్రంలో యూనియన్ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం పోరాడుతామని తెలిపారు. ప్రస్తుతం మీడియా రంగం అనేక సవాళ్లను ఎదుర్కొంటుందని అన్నారు. జర్నలిస్టుల భద్రత, సంక్షేమం, అక్రిడిటేషన్ కార్డులు, ఆరోగ్య సదుపాయాలు, ఇండ్ల స్థలాల వంటి అంశాలపై సంఘం నిరంతరం పోరాటం కొనసాగిస్తుందని అన్నారు. జర్నలిస్టుల ఐక్యతతోనే హక్కుల సాధన సాధ్యమవుతుందని జర్నలిస్టులు అందరూ సంఘటితంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఒక డాక్టర్ పొరపాటు చేస్తే రోగి చనిపోతాడు, ఒక ఇంజినీర్ తప్పు చేస్తే కట్టడం కూలి పోతుంది కానీ ఒక జర్నలిస్ట్ దారి తప్పితే సమాజానికే ప్రమాదమని ఆందోళన వ్యక్తం చేశారు. జర్నలిస్టులు ఎప్పుడూ ప్రజాహితం కోసం పాటు పాడాలని ఉద్బోధించారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం మన సంఘం ఎప్పుడూ ముందుంటుందని తెలిపారు. సభ్యత్వ నమోదు కార్యక్రమంలో డివిజన్ కోశాధికారి బూడిద శ్రీనివాస్ యాదవ్, శ్రీనివాస్ రెడ్డి, ఏరుకొండ రాము, సయ్యద్ పాషా, ఖాజా మొహినుద్దీన్, రాకేష్ గౌడ్, కొర్ర నాగరాజు, భూతరాజు సైదులు తదితరులు పాల్గొన్నారు.





## నూతన ఎస్సై నరేష్ ని మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు

### టి.పి.సి.సి రాష్ట్ర మాజీ జాయింట్ సెక్రెటరీ ఎండి.అజీజ్ పాషా

**హుజూర్ నగర్, (జనంసాక్షి) :**
హుజూర్ నగర్ కు ఎస్ హెచ్ ఓ (ఎస్సైగా) నియామకమై బాధ్యతలు స్వీకరించిన చలిగంటి నరేష్ ని గురువారం పోలీస్ స్టేషన్లో స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకుల బృందం మర్యాదపూర్వకంగా కలిసి బొకే, శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సమ్మెట సుబ్బరాజు,,ముషం సత్యనారాయణ, బొడ్డు గోవిందరావు, పోతుల జ్ఞానయ్య, పారత బోయిన రామ్మూర్తి, జింజిరాల సైదులు, శ్రీనివాస్ రెడ్డి, నరసింహ చారి తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య

### మండల విద్యాధికారి కాటయ్య



**పాలకవీడు (జనంసాక్షి )**
ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ఈ నెల 14 వ తేదీన నుంచి 19 వరకు బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు మండల విద్యాధికారి కాటయ్య ఇంజమూరి తెలిపారు. మండలంలో పలు గ్రామాల్లో బడిబాట కార్యక్రమాన్ని పలు పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులతో కలిసి ప్రారంభించి గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ బడి బాట కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య అందుతుందని ఇటీవల జరిగిన ఎస్ ఎస్ సి పరీక్షలలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ప్రైవేట్ విద్యార్థులకు దీటుగా సత్తాని విషయాన్ని గుర్తు చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వం మాలిక సదుపాయాల కల్పనకు కోట్లాది రూపాయల నిధులను ఖర్చు చేస్తూ సౌకర్యాలను మెరుగుపరుస్తుందని తెలియపరిచారు.పాఠశాలలో సౌకర్యాలను మెరుగుపరచడం పాటు డిజిటల్ బోధనను ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని తెలియపరిచారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి సమాజంలో ఉన్న పెద్దలు ప్రముఖులు యువకులు,రాజకీయ నాయకులు ముఖ్యంగా తల్లిదండ్రులు అందరూ కూడా తమ యొక్క సహాయ సహకారాలను అందించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సీనియర్ ఉపాధ్యాయులు ఉపేందర్, శ్రీనివాస రెడ్డి , స్వప్న రహమ తున్నీసా నరేష్ పాల్గొన్నారు.

### విద్యార్థుల తల్లిదండ్రులు తప్పనిసరిగా ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలి

### - 8వ వార్డు కౌన్సిలర్ కోలా ఉదయభాను

**హుజుర్ నగర్, (జనంసాక్షి) :**
ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందని గోవిందాపురం 8వ వార్డు కౌన్సిలర్ కోల ఉదయభానుఉపేందర్ అన్నారు. గురువారం పట్టణంలోని గోవిందాపురంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థుల తల్లిదండ్రులు తప్పనిసరిగా ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలని పిలుపునిచ్చారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి గోవిందపురం ప్రభుత్వ పాఠశాలకు 20 లక్షల రూపాయలు నిధులు మంజూరు చేశారని తెలిపారు. త్వరలోనే మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చేతుల మీదుగా పాఠశాల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎమ్ గొట్టే శ్రీనివాసరావు, ఉపాధ్యాయుల వీరస్వామి, చంద్రశేఖర్, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ నాగలక్ష్మి పాల్గొన్నారు.



## నిబంధనల ప్రకారం దాన్యం కొనుగోళ్లు చెయ్యాలి :మాజీ ఎమ్మెల్యే శేఖర్ రెడ్డి

**వలిగొండ, మే 14 (జనంసాక్షి)**
ప్రభుత్వం దాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి అన్నారు. గురువారం ఆయన బి ఆర్ ఎస్ నాయకులతో కలిసిమండలకేంద్రం లోని వ్యవసాయ మార్కెట్ లో ఏర్పాటుచేసిన దాన్యం కొనుగోలు కేంద్రం, లింగరాజుపెల్లి దాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించి రైతులతో మాట్లాడుతూ రైతులు ఆరుకాలం కష్ట పడి పండించిన దాన్యం కొనుగోలు కేంద్రాలలో నిల్వ చేసి కొనుగోళ్లు కాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాతావరణం అనుకులించక అకాల వర్షం కురిస్తే కొనుగోలు కేంద్రాలలోని దాన్యం తడిస్తే మరీ ఇబ్బందులు ఎదురైవుతాయని, రైతుల కళ్ళల్లో నీరు కన్పిస్తుందని అన్నారు. లారీల సమస్య అధికంగా ఉందని, లోడుచేసి మిల్లు వద్దకు పంపిన లారీలను మిల్లు యజమానులు కట్టింగులు చేసి ఆలస్యంగా దిగుమతి చేస్తున్నారని, అధికారులు మిల్లు యజమానులు కుమ్మక్కాయ్ అధిక తుకాలు 41 కే జి బదులు 42 కే జి లు తుకాలు వేస్తున్నారని అధికారులు వెంటనే నిబంధనల ప్రకారం తుకాలు వెయ్యాలన్నారు. ప్రజా ప్రాతినిధులు, అధికారులు స్పందించి మిల్లు యజమానులతో సమీక్షా నిర్వహించి నిబంధనల ప్రకారం తుకాలు చేసి, లారీలా సమస్యలు తీర్చి కొనుగోళ్లు వేగవంతం చేయాలని అన్నారు. లేని పక్షంలో రైతులతో కలిసి రోడ్ల పైకి రావసలిసి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వంగాల వెంకన్న గౌడ్, తుమ్మల వెంకట్ రెడ్డి, సురకంటి వెంకట్ రెడ్డి, మొగుళ్ళ శ్రీనివాస్, ముద్దసాని కిరణ్ రెడ్డి, ఎం డి అఫ్రోజ్, వివిధ గ్రామాల సర్పంచులు, మాజీ సర్పంచులు, పార్టీనాయకులు తదితరులు పాల్గొన్నారు.





# బతుకు భారమై - జీవితం అవిటిదై

○వరదలో భార్యను కోల్పోయిన నాగేశ్వరరావు

○ఒక్క చేత్తోనే జీవన పోరాటం

○ప్రభుత్వ సాయం కోసం ఎదురు చూపులు? ఇద్దరు కుమారులతో దయనీయ పరిస్థితి

○మున్నేరు వరదలు మిగిల్చిన తీరని విషాదం

**చింతకాని, మే 14 (జనంసాక్షి)**

2024లో కురిసిన భారీ వర్షాలు, మున్నేరు వరదలు ఎన్నో కుటుంబాల్లో విషాదాన్ని నింపాయి. వరదల ధాటికి అనేక మంది తమ ఆస్తులు, పంటలు కోల్పోగా, మరికొన్ని కుటుంబాలు ప్రాణ నష్టాన్ని చవిచూశాయి. అలాంటి బాధిత కుటుంబాల్లో చింతకాని మండలం రామకృష్ణాపురం గ్రామానికి చెందిన గుర్రం నాగేశ్వరరావు కుటుంబం ఒకటి. ఒకప్పుడు కష్టపడి కుటుంబాన్ని పోషించిన నాగేశ్వరరావు, ఇప్పుడు ఒక్క చేత్తోనే జీవన పోరాటం చేస్తూ దయనీయ పరిస్థితుల్లో రోజులు గడుపుతున్నాడు.

**బురదలో జారిన బైక్- జీవితాన్నే మార్చేసిన ప్రమాదం:**

వరదలు తగ్గాయని భావించిన నాగేశ్వరరావు తన భార్య వసంతతో కలిసి ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. ఖమ్మం?దంసలాపురం ఫ్లైఓవర్ సమీపానికి చేరుకోగానే రహదారిపై పేరుకుపోయిన బురద కారణంగా వాహనం అదుపుతప్పి కిందపడింది. ఒక్క క్షణంలో జరిగిన ఆ ప్రమాదం వారి కుటుంబ జీవితాన్నే తలకిందులు చేసింది. తీవ్రంగా గాయపడిన వసంతను ఆసుపత్రికి తరలించినప్పటికీ చికిత్స పొందుతూ ఆమె మృతి చెందింది. అదే ప్రమాదంలో నాగేశ్వరరావుకు కుడిచేయి తీవ్రంగా దెబ్బతింది.

**అప్పులు చేసి చికిత్స- అయినా కోలుకోని చేయి:**

భార్యను కోల్పోయిన బాధలోనే నాగేశ్వరరావు చికిత్స కోసం కుటుంబ సభ్యులు తీవ్రంగా శ్రమించారు. అప్పులు చేసి హైదరాబాద్‌లోని ఆసుపత్రుల్లో చికిత్స చేయించారు. ఆపరేషన్ చేసినప్పటికీ చేయి పూర్తిగా కోలుకోలేదు. కాలక్రమేణా కుడిచేయి పూర్తిగా పనిచేయకుండా పోవడంతో నాగేశ్వరరావు వికలాంగుడిగా మారాడు. ప్రస్తుతం ఒక చేత్తోనే రోజువారీ పనులు చేసుకుంటూ బతుకును లాగిస్తున్నాడు.

**తండ్రి బాధ-పిల్లల భవిష్యత్తుపై ఆందోళన:**

భార్య మరణంతో ఇద్దరు కుమారుల బాధ్యత పూర్తిగా నాగేశ్వరరావుపైనే పడింది. శారీరక వైకల్యం కారణంగా కూలి పనులకు వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. కుటుంబ పోషణ, పిల్లల చదువులు, ఇంటి ఖర్చులు అన్నీ భారంగా మారాయి. రోజువారీ అవసరాలకే ఇబ్బందులు పడుతున్నామని, కొన్నిసార్లు భోజనం కోసం కూడా ఇతరుల సహాయం ఆశ్రయించాల్సి వస్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.



**అందని శ్రీనిధి ఇన్సూరెన్స్ సాయం:**

ప్రమాదం జరిగి దాదాపు సంవత్సరం ఎనిమిది నెలలు గడుస్తున్నా ప్రభుత్వం నుంచి రావాల్సిన శ్రీనిధి ఇన్సూరెన్స్ సాయం ఇప్పటికీ అందలేదని నాగేశ్వరరావు వాపోతున్నాడు. ఎన్నిసార్లు కార్యాలయాల చుట్టూ తిరిగినా ఫలితం లేకపోయిందని చెబుతున్నాడు. బాధిత కుటుంబానికి అందాల్సిన సాయం ఆలస్యం కావడంతో వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

**వికలాంగుడైనా- పెన్షన్ మాత్రం మంజూరు కాదు:**

కుడిచేయి పూర్తిగా పనిచేయకపోయినా వైద్యులు 40 శాతం వికలాంగత్వమే ఉందని ధృవీకరణ ఇవ్వడంతో వికలాంగుల పెన్షన్ మంజూరు కాలేదని నాగేశ్వరరావు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. చేతి పనులు చేయలేని స్థితిలో ఉన్నప్పటికీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదరణ అందడం లేదని కుటుంబ సభ్యులు వాపోతున్నారు.

**“ఒక్క ప్రమాదం మా జీవితాన్ని ఛిద్రము చేసింది”:**

“భార్యను కోల్పోయాను- చేయి పనిచేయడం లేదు? పిల్లల భవిష్యత్తు ఎలా ఉంటుందో తెలియడం లేదు. కష్టపడి బతికే మా



జీవితాన్ని ఒక్క ప్రమాదం పూర్తిగా మార్చేసింది” అంటూ నాగేశ్వరరావు కన్నీటి పర్యంతమయ్యాడు. అతని పరిస్థితి చూసిన గ్రామస్థులు సైతం భావోద్వేగానికి గురవుతున్నారు.

**ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలంటున్న గ్రామస్థులు:**

ఇలాంటి దయనీయ పరిస్థితుల్లో జీవనం సాగిస్తున్న నాగేశ్వరరావు కుటుంబాన్ని ప్రభుత్వం, సంబంధిత అధికారులు వెంటనే ఆదుకుని న్యాయం చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు. శ్రీనిధి ఇన్సూరెన్స్ సాయం వెంటనే విడుదల చేయడంతో పాటు వికలాంగుల పెన్షన్ మంజూరు చేసి కుటుంబానికి అండగా నిలవాలని విజ్ఞప్తి చేస్తున్నారు



## అణగారిన వర్గాలకు చిహ్నాం పిడమర్తి రవి జన్మదిన వేడుకలు

**దేవరకొండ, మే 14(జనంసాక్షి)**

దళితులు, అణగారిన వర్గాల ఆత్మగౌరవ చిహ్నాం పిడమర్తి రవి అని దేవరకొండ మాదిగ జేఏసీ ఇంచార్జ్ నాగిల్ల రవి అన్నారు.రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి జన్మదిన వేడుకలు సన్నిహితులు, అభిమానుల నడుమ గురువారం నాగిళ్ల రవి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాదిగ జేఏసీ ఇంచార్జ్ నాగిళ్ల రవి మాట్లాడుతూ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో ఉస్మానియా జేఏసీ చైర్మన్ గా కీలకంగా వ్యవహరించి ప్రత్యేక రాష్ట్ర కలను సాకారం చేయడంలో పిడమర్తి పాత్ర ఎనలేనిదన్నారు. అంటరానితనం అనే అమానవీయ దురాచారానికి అత్యంత దారుణంగా బలైపోయిన మాదిగలకు ఎస్సీ వర్గీకరణ ద్వారా న్యాయం చేయాలని పోరాటాలు చేశాడని గుర్తు చేశారు. సామాజిక ఉద్యమాల్లో కీలకంగా వ్యవహరించి అణగారిన వర్గాలకు గొంతుగా మారాడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో నల్లగంటి కొండల్,చాట్ల రమేష్, వెంకటయ్య,లాలయ్య, నారాయణరెడ్డి ,నాగిళ్ల శివ ప్రజా సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పేద ముస్లిం కుటుంబానికి ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి భరోసా

### రూ. లక్ష రూపాయల చెక్కు అందజేత

**మునుగోడు, మే 14( జనంసాక్షి)**

తండ్రి మరణించి పేదరికంలో కొట్టుమిట్టాడుతున్న నిరుపేద ముస్లిం యువతి వివాహానికి అండగా నిలిచారు మునుగోడు శాసనసభ్యులు శ్రీ కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మునుగోడు పట్టణానికి చెందిన షాహిదా భర్తను కోల్పోయి అనారోగ్యంతో బాధపడుతూ కుటుంబాన్ని నెట్టు కొస్తుంది.ఎదిగొచ్చిన తన కూతురి వివాహం చేయడానికి ఆర్థికంగా ఇబ్బంది పడుతుండగా, శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ని కలిసి తన కుమార్తె వివాహానికి గాను సహాయం కోరగా, వెంటనే స్పందించిన ఎమ్మెల్యే కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ ద్వారా 1 లక్ష రూపాయలు ఆర్థిక సహాయం చేస్తానని హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీ మేరకు గురువారం లక్ష రూపాయల చెక్కు ను స్థానిక నాయకుల ద్వారా పెళ్లి కూతురుకు అందించారు. నియోజకవర్గ ప్రజలకు ఏ చిన్న కష్టం వచ్చినా తన సొంత బిడ్డలుగా బావిస్తూ చేతనైన సహాయం చేస్తూ ఆదరిస్తున్న మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిని జన్మజన్మలకు గుర్తుంచుకుంటామని ఆ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు యువజన కాంగ్రెస్ జిల్లా మాజీ అధ్యక్షులు పాల్వాయి జితేందర్ రెడ్డి, మాజీ ఎంపీపీ కర్ణాటక స్వామి యాదవ్ మాజీ సర్పంచ్ మిర్యాల వెంకటేశ్వర్లు సాగర్ లింగ స్వామి దుబ్బ ప్రభాకర్ వల్లం చెట్ల రవి తదితరులు పాల్గొన్నారు.





## పరపతి సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలి

○నామినేటెడ్ పద్ధతి సరైనది కాదు

○సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా కార్యదర్శి కంబాల శ్రీనివాస్

**హుజూర్ నగర్, (జనంసాక్షి):**

తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఆధ్వర్యంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేస్తూ స్థానిక ఆర్డిఓ కార్యాలయం ఎదుట బెజవాడ వెంకటేశ్వర్లు, కంబాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. గురువారం ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు తక్షణమే ఎన్నికల నిర్వహించాలని నామినేట్ చేసే పద్ధతి సరైనది కాదని, ప్రజాస్వామ్య విరుద్ధమని వారన్నారు. వ్యవసాయం మీద ఆధారపడి రైతులు నూటికి 70 శాతం మంది ఉన్నారని వారికి అందుబాటులో ఉండే గ్రామీణ బ్యాంకు వ్యవసాయ పరపతి సంఘం అని అన్నారు. తరతరాలుగా రైతులు ఏర్పాటు చేసుకున్న పరపతి సంఘాలను పద్ధతులు ఎన్నికలు నిర్వహించి పరపతి సంఘాలకు స్వతంత్ర ప్రతిపత్తి ఏర్పాటు చేయాలని, నిధులు ఎక్కువ కేటాయించి చిన్న, సన్న కార్ రైతాంగానికి సహాయపడే విధంగా విధివిధానాలను మెరుగుపరచాలని వారన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ఎల్లావుల రాములు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు గుండు వెంకటేశ్వర్లు, దేవరం మల్లేశ్వరి, జిల్లా సమితి సభ్యులు ఎల్లావుల రమేష్, రైతు సంఘం పట్టణ కార్యదర్శి మామిడి నరసయ్య, సోమగానికి కృష్ణ, మామిడి వెంకయ్య, కౌన్సిలర్ చెన్నగాని సైదులు ఇందిరాల వెంకటేశ్వర్లు, కుడితి స్వామి, బంటు శ్రీనివాస్, బత్తిని మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



**సీఎం రేవంత్ రెడ్డి, ప్రభుత్వ విప్ చిత్రపటాలకు పాలభిషేకం**

**ఆలేరు మే 14 జనంసాక్షి**

గత కొద్ది రోజులుగా ఇబ్బందుల్లో ఉన్న నల్గొండ రంగారెడ్డి మదర్ డైరీని రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు రేవంత్ రెడ్డి దృష్టికి ఆలేరు ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ డైరీ సమస్యను తీసుకెళ్లి పాడి రైతులను డైరీ కార్మికులను కాపాడునుందుకు చేసిన కృషివల్లే మదర్ డేరికి 10 కోట్ల రూపాయలు నిధులు మంజూరు చేయడం పై ఐ ఎన్ టి యు ఆధ్వర్యంలో హర్షం వ్యక్తం చేస్తూ ఐఎన్టీయూ జిల్లా నాయకులు ఆలేటి అనిల్ బుధవారం సీఎం రేవంత్ రెడ్డి ఆలేరు ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మదర్ డైరీ చైర్మన్ గుడిపాటి మధుసూదరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ చైతన్య రెడ్డి, మున్సిపల్ చైర్మన్ బాలమణి భాస్కర్, వైస్ చైర్మన్ ఆంజనేయులు, కౌన్సిలర్లు మరియమ్మ, ఆంజనేయులు, సరిత, సంపత్, నీరజ, నాయకులు ముదిగొండ శ్రీకాంత్, ఉట్కూరి సురేష్, వానరాశి మార్క్, సాగర్ రెడ్డి, శ్రీకాంత్, సిద్ధులు, తదితరులు పాల్గొన్నారు.

## ఆహార కల్తీని అరికట్టేందుకు చర్యలు చేపట్టాలి

## స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు

**యాదాద్రి, కరస్పాండెంట్ మే 14 (జనం సాక్షి)**

జిల్లాలో ఆహార కల్తీని అరికట్టేందుకు చర్యలు చేపట్టాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు అన్నారు. గురువారం కలెక్టరేట్ లోని తన ఛాంబర్ లో ఆహార భద్రతపై జిల్లా స్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజారోగ్యం, ఆహార నాణ్యత మరియు కల్తీ నివారణపై పలు కీలక నిర్ణయాలు తీసుకున్నామని.జిల్లాలోని ప్రభుత్వ రెసిడెన్షియల్ విద్యాసంస్థలు మరియు హాస్టళ్లలో ఆహారాన్ని వండే సిబ్బందికి తక్షణమే ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. ముఖ్యంగా గుడ్ల నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడకూడదని స్పష్టం చేశారు. జిల్లాలో ప్రస్తుతం ప్రధాన సమస్యగా మారిన పాల కల్తీపై ఆహార భద్రత అధికారులు, పోలీస్ అధికారులతో కలిసి ఉమ్మడి దాడులు నిర్వహించి, కల్తీకి పాల్పడే వారిపై కఠినమైన కేసులు నమోదు చేయాలని సూచించారు.చిరు మరియు మధ్యతరగతి వ్యాపారులు ఎఫ్ఎస్ఎస్ఐ లైసెన్స్ పొందాలని మరియు వారికి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. సేంద్రీయ వ్యవ సాయాన్ని ప్రోత్సహించాలని మరియు కూరగాయలు మరియు పండ్ల సాగుకై ఎరువుల వాడకం తగ్గించాలని అన్నారు.?ఆహార భద్రత నియమిత అధికారి పి. స్వాతి మాట్లాడుతూ జిల్లాలో ఆహార కల్తీని అరికట్టేందుకు తమ బృందం నిరంతరం శ్రమిస్తుందని, నిబంధనలు పాటించని వ్యాపారులపై భారీ జరిమానాలు విధిస్తామని, క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.?ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి మనోహర్, జిల్లా విద్యాశాఖ అధికారి సత్యనారాయణ, జిల్లా సంక్షేమ అధికారి నరసింహారావు, భువనగిరి రూరల్ సిఐ చంద్రబాబు మరియు పలు శాఖల జిల్లా అధికారులు మరియు సలహా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



# అభివృద్ధికి తొలి ప్రాధాన్యత

## సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే

**దేవరకొండ, మే 14(జనంసాక్షి)**

దేవరకొండ మున్సిపాలిటీ పరిధిలో మౌలిక వసతుల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నట్లు దేవరకొండ శాసనసభ్యులు నేనావత్ బాలు నాయక్ అన్నారు.గురువారం పట్టణంలోని 3వ వార్డులో ఎన్ హెచ్ 167 నుండి గాజీనగర్ బీటీ రోడ్డు వరకు నగరాభివృద్ధి నిధుల నుండి ఒక కోటి 20 లక్షల రూపాయలతో నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు స్థానిక ప్రజా ప్రతినిధులు మరియు అధికారులతో కలిసి శాసన సభ్యులు నేనావత్ బాలు నాయక్ శంకుస్థాపన చేసారు. పట్టణ అభివృద్ధి పనులకు, మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని అన్నారు.సీసీ రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యత లోపం లేకుండా అధికారులు పరిశీలించాలని అన్నారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రామదుర్గా రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ పున్న శైలజ వెంకటేశ్వర్లు, అలంపల్లి నరసింహ, వర్త్య దేవేందర్ నాయక్, శిరందాసు కృష్ణయ్య, కౌన్సిలర్లు మొహమ్మద్ యునుస్, అంకురి సుమలత రాజేష్, గాజుల మురళి, షేక్ నవీన్, పొట్ట మధు, హనుమంతు సాయి చంద్ర గౌడ్, మొయినుద్దీన్ , ఇతర ప్రజా ప్రతినిధులు,తదితరులు పాల్గొన్నారు.



## శ్రీ శ్రీ ఆభయాంజనేయ స్వామి వారి విగ్రహా ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే

**దేవరకొండ, మే 14(జనంసాక్షి)**

దేవరకొండ మండలంలోని గన్యానాయక్ తండాలో నిర్వహించిన శ్రీ శ్రీ ఆభయాంజనేయ స్వామి వారి విగ్రహా ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ పాల్గొని, స్వామి వారిని దర్శించుకొని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారి ఆశీస్సులతో నియోజకవర్గ ప్రాంత ప్రజలు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో, పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు.అనంతరం గ్రామ నాయకులు మరియు ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేకి శాలువాతో సత్కారించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ నాయిని జామున మాధవ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ పున్న శైలజ వెంకటేశ్వర్లు, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహా, మండల పార్టీ అధ్యక్షులు లోకాసాని శ్రీధర్ రెడ్డి, బాధ్య నాయక్,మాజీ జడ్పీటీసీ అరుణ సురేష్ గౌడ్,యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షులు కిన్నెర హరికృష్ణ,స్థానిక సర్పంచ్ గోపాల్ నాయక్, జిల్లా నాయకులు మల్లా రెడ్డి,కిషన్ నాయక్,సర్పంచులు,నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## రైస్ మిల్లులను తనిఖీ చేసిన ఎంపీడీవో

**వలిగొండ, మే 14 (జనంసాక్షి)**

జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండల పరిషత్ అభివృద్ధి అధికారి జి. జలందర్ రెడ్డి మండలంలోని నాగారం గ్రామంలో ఉన్న వాసవి ప్యాడీ రైస్ మిల్లును తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రోజుకు ఎన్ని లారీల ద్వారా ధాన్యం దిగుమతి అవుతోందో, ఎంత పరిమాణంలో లోడ్లు స్వీకరిస్తున్నారో, అలాగే మిల్లులో నిల్వ సామర్థ్యం ఎంత ఉందో సంబంధిత యాజమాన్యాన్ని అడిగి తెలుసుకున్నారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం అన్‌లోడింగ్ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని సంబంధిత యాజమాన్యాన్ని ఆదేశించారు. ప్రస్తుతం మిల్లులో మొత్తం 16 లారీలు ఉండగా, అందులో 2 లారీల ధాన్యాన్ని అన్‌లోడ్ చేసినట్లు తెలిపారు సాయంత్రంలోపు మొత్తం లారీలు అన్లోడ్ చేస్తామని మిల్లు యాజమాన్యం తెలిపారు. అదేవిధంగా స్టాక్ రిజిస్టర్లు మరియు రవాణా లాగ్ బుక్సను పరిశీలించారు.

## విద్యార్థులను సన్మానించిన గ్రామ సర్పంచ్




**వలిగొండ , మే 14 (జనంసాక్షి)**

మండలంలోని పులిగిల్ల గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10 తరగతి ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు, 100%ఫలితాలకు కృషి చేసిన పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయ బృందాన్ని అభినందిస్తూ గ్రామ సర్పంచ్ వేముల అనూష మల్లేష్ సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమానికి గ్రామ ఉప సర్పంచ్ వడ్డేమాన్ దేవేందర్, పంచాయతి కార్యదర్శి జోగు సైదులు, ఏ ఏ పి సి చైర్మన్ అమృతమ్మ ,వార్డు సభ్యులు వేముల నాగరాజు, బుగ్గ కృష్ణ తదితరులు పాల్గొనడం జరిగింది.

## అభయాంజనేయ స్వామి అనుగ్రహం పొందాలి

## ప్రతి ఒక్కరూ భక్తి భావాన్ని పెంపొందించుకోవాలి

**దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్**



**దేవరకొండ, మే 14(జనంసాక్షి)**

ప్రతి ఒక్కరు అభయాంజనేయ స్వామి అనుగ్రహం పొందాలని దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ అన్నారు. గురువారం దేవరకొండ మండలం గన్యానాయక్ తండాలో శ్రీశ్రీశ్రీ అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట మహోత్సవం కార్యక్రమంలో మాజీ శాసన సభ్యులు రవీంద్ర కుమార్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ భక్తి భావాన్ని పెంపొందించుకోవాలని, దైవచింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని తెలిపారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే రవీంద్ర కుమార్ని ఆలయ కమిటీ సభ్యులు సన్మానించారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నేనావత్ కిషన్ నాయక్,బిఆర్ఎస్ మాజీ మండల పార్టీ అధ్యక్షులు టీవీఎన్ రెడ్డి, స్థానిక సర్పంచ్ నేనావత్ గోపాల్ నాయక్, రామావత్ తులిసీరామ్,బొడ్డుపల్లి కృష్ణ, నేనావత్ నగేష్,తదితరులు పాల్గొన్నారు.

# పంట కొనే దిక్కులేక రైతులు అవేదన



**అప్పులు తెచ్చి పంట పండిస్తే కొనే దిక్కులేక పోయారు**

**కేసీఆర్ ఉన్నపుడు ఎప్పుడూ వడ్ల కొనుగోలులో ఇంత ఆలస్యం కాలేదు.**

**కాంగ్రెస్ సర్కార్ నిర్లక్ష్యంతో అన్నదాతలకు అపార నష్టం**

**దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్**

**దేవరకొండ, మే 14(జనం సాక్షి )**

ఆరుగాలం కష్టపడి పండించిన పంట కొనే దిక్కులేక రైతులు అవేదన చెందుతున్నారని దేవరకొండ మాజీ శాసన సభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ అన్నారు. గురువారం డిండి మండలం తవక్లపుర్ లో ధాన్యం కొనుగోలు కేంద్రంను అయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అప్పులు తెచ్చి పంట పండిస్తే కొనే దిక్కులేక పోయారని అన్నారు. గన్ని బ్యాగులు ఇచ్చే పరిస్తితిలో ప్రభుత్వం లేదని అన్నారు. కేసీఆర్ ఉన్నపుడు ఎప్పుడూ వడ్ల కొనుగోలులో ఇంత ఆలస్యం కాలేదని ఆయన గుర్తు చేశారు. ప్రభుత్వం రైతుల నుండి తరుగు పేరిట 2 కేజిల వడ్లు కట్ చేస్తున్నారని వెంటనే ఆపాలని కోరారు. మిల్లర్లు 3కేజీలు కట్ చేస్తున్నారు అని ఆయన తెలిపారు. అధికారులు ఏం చేస్తున్నారని,కొనుగోలు కేంద్రాల్లో తిరగాలని సూచించారు. ఈ ప్రభుత్వం రైతుల ఉసురు పోసుకుంటుందని అన్నారు. పాలన చేతకాకుంటే రేవంత్ రెడ్డి దిగిపోవాలని కోరారు. ఎన్నికల ముందు ఇచ్చిన 7గ్యారంటీలు,420హామీలు అమలు చేయాలి అని ఆయన డిమాండ్ చేశారు. అధికారులతో ఫోన్లో మాట్లాడి తక్షణమే ధాన్యం కొనుగోలు పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మాజీ మండల అధ్యక్షులు రాజీనేని వెంకటేశ్వర్ రావు, పి ఏ సి ఎస్ చైర్మన్ మాధవరం శ్రీనివాస్ రావు, సర్పంచ్ మాల్ రెడ్డి విష్ణువర్ధన్ రెడ్డి, రవీందర్ రావు, గొడుగు వెంకటయ్య, గిరమోని శ్రీను,రమావత తులిసీరామ్, జంగయ్య,నాయకులు తదితరులు ఉన్నారు.